# విషయసూచిక


1. రక్షకుని మహాత్మ్యము........................ ............ 5

2. మన ఉన్నత పిలుపు: నూతన సృష్టి..................... 13

3. మన ఉన్నత పిలుపు: దేవుని పాలివారము ............ 18

4. గొప్ప ఆధిక్యత ............................................. 25

5. గొప్ప ప్రధాన యాజకుడు ................................ 29

6. నిశ్చలమైన లంగరు ........................................ 34

7. దేవుని గొప్ప కోరిక ......................................... 36

8. గొప్ప ప్రత్యక్ష గుడారము ................................ 40

9. గొప్ప స్వాస్థ్యమునకు సిద్ధపాటు ......................... 46

10. దేవుని సన్నిధిలో గొప్ప ధైర్యము ........................ 59

11. గొప్ప విశ్వాస వీరులు ......................................... 61

12. గొప్ప దైవభక్తి.................................................. 69

13. గొప్ప వాగ్దానము ............................................. 71

# తొలి పలుకులు

మానవుడు పుట్టుకతోనే పాపి.దావీదు మహారాజు ఈలాగనెను, "నేను పాపములో పుట్టినవాడను, పాపములోనే నాతల్లి నన్ను గర్భమున ధరించెను" (కీర్తన 51:5). ఈ మాట ప్రతి మనుష్యుని విషయములోను సత్యము. అందువలననే మానవుని తలంపులు, మాటలు, క్రియలు ఎల్లప్పుడును పాపిష్ఠివైయున్నవి. "నరుల చెడుతనము భూమిమీద గొప్పదనియు, వారి హృదయము యొక్క తలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదనియు యెహోవా చూచెను" (ఆదికాండము 6:5). దేవుడు పరిశుద్ధుడు, న్యాయవంతుడు గనుక ఆయన న్యాయచట్ట ప్రకారము "పాపము చేయువాడెవడో వాడే మరణము నొందును" (యెహెజ్కేలు 18:4). ఇది శారీరక మరణము కాదు, గాని ప్రేమగల సృష్టికర్త నుండి దూరము చేయబడి యుగయుగములు నరకాగ్నిలో శ్రమననుభవించుట యనెడి రెండవ మరణము. అయితే దేవుడు ప్రేమగల తండ్రిగా మానవకోటి ఈ రెండవ మరణమునకు గురికావలెనని కోరలేదు. వారిని రెండవ మరణము నుండి ఆయన రక్షింపగోరెను. యేసు క్రీస్తు ప్రభువు రూపములో ఆయన సర్వమానవ కోటి యొక్క వర్తమాన, భూత, భవిష్యత్కాలముల పాపములన్నిటికిని రావలసిన శిక్షను భరించుటకు ఈ లోకమునకు వచ్చెను. పాపరహితమైన జీవితమును ఈ లోకములో జీవించి,ప్రజల పాపములకు విమోచన క్రయధనముగా కల్వరి సిలువలో తన ప్రాణము, నర్పించెను. ఆయన చనిపోయి పాతిపెట్టబడెను. అయితే

మూడవ దినమున ఆయన మరణమును జయించి తిరిగి లేచెను. దీనముగా ఆయన గెంతకు వెళ్లి తమ పాపములను ఆయన యెదుట ఒప్పుకొనువారిని క్షమించుటకును, జీవముగల దేవుని నుండి నిరంతరమునకు దూరము చేయబడుటయను పాప ఫలితము నుండి రక్షించుటకును ఇప్పుడు యేసుక్రీస్తు ప్రభువు సజీవుడుగా వున్నాడు. "ఏలయనగా శత్రువులమై యుండగా ఆయన కుమారుని మరణము ద్వారా మనము దేవునితో సమాధానపరచబడిన యెడల సమాధానపరచబడిన వారమై, ఆయన జీవించుటచేత మరి నిశ్చయముగా రక్షింపబడుదుము" (రోమా 5:10). యేసుక్రీస్తు ప్రభువునందు విశ్వసించువారికి ఆయన అందించు రక్షణ కేవలము రెండవ మరణము నుండి తప్పించుట మాత్రమే గాక దానితో అత్యధికమైన ఆశీర్వాదములను కూడ అనుగ్రహించును. ఎందుకనగా దేవుడు ఇచ్చునప్పుడు సమస్తము సమృద్ధిగా యిచ్చును. హెబ్రీయులకు వ్రాసిన పత్రికలో ఈ మహా రక్షణను గురించి కొన్ని విషయములను చూడగలము.

## మొదటి అధ్యాయము

# రక్షకుని మహాత్మ్యము

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక మొదటి అధ్యాయములో అపొస్తలుడు మహా రక్షణను సాధించిన ప్రభువు యొక్క మహాత్మ్యమును వివరించుచున్నాడు. దేవుడు ఎంతో గొప్పవాడైనను తనంతట తానే ఈ మహా రక్షణను మన కొరకు తెచ్చియున్నాడు. ఆయన మన రక్షకుడు మాత్రమే గాక, మన సృష్టికర్త కూడ ఆయనే! "ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తము నకును వారసునిగా నియమించెను. ఆయన ద్వారా ప్రపంచము లను నిర్మించెను" (2వ వచనము). ఆయన మన సృష్టికర్త. సర్వజగత్తు ఆయనదే. ఈ భూమి మీద మనకు కనబడునదంతయు ఆయనే కలుగజేసెను. కొలొస్స 1:16, 17లలో ఈలాగు వ్రాయబడినది, "ఏలయనగా ఆకాశ మందున్నవియు, భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను, ప్రభుత్వములైనను, ప్రధానులైనను, అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను. సర్వమును ఆయన ద్వారాను ఆయనను బట్టియు సృజింప బడెను. ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు; ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు. ఇదే తలంపు లేఖనములలో

అయా చోట్ల మరల చెప్పబడినది. ఒక సత్యమును పలుమార్లు చెప్పుట ద్వారా పరిశుద్ధాత్మ దానిని స్థిరపరచుచున్నాడు. "సమస్తమును ఆయన మూలముగా కలిగెను, కలిగియున్న దేదియు ఆయన లేకుండ కలుగలేదు" (యోహాను 1:2,3). "అల్ఫాయు ఓమెగయు నేనే. వర్తమాన భూత భవిష్య త్కాలములలో ఉండువాడను నేనే అని సర్వాధికారియు దేవుడునగు ప్రభువు సెలవిచ్చుచున్నాడు" (ప్రకటన 1:8). ఆయనే సృష్టికర్త, సర్వమును ఆయన నిమిత్తమే సృష్టింబడెను. ఆయనే ఆదియు, అంతమునై యున్నాడు. ఆయన ఒక్కమాటతో సర్వమును సృజించెనని చదువుచున్నాము. "యెహోవా వాక్కుచేత ఆకాశములు కలిగెను. ఆయన నోటి ఊపిరిచేత వాటి సర్వ సమూహము కలిగెను" (కీర్తన 33:6). ఆయన మాట పలికిన వెంటనే సమస్తమును కలిగెను. శూన్యములో నుండి సమస్తమును కలిగెను. "ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణమైన వనియు, అందునుబట్టి దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మింపబడలేదనియు విశ్వాసముచేత గ్రహించుకొనుచున్నాము" (హెబ్రీ 11:3). ఉదాహరణకు ఆదికాండము 1:11లో ఈలాగున చదువుచున్నాము. "దేవుడు-గడ్డిని, విత్తనములిచ్చు చెట్లను భూమి మీద తమ తమ జాతి ప్రకారము తమలో విత్తనములు గల ఫలమిచ్చు ఫల వృక్షములను భూమి మొలిపించుగాకని పలుకగా ఆప్రకారమాయెను." భూమిని దున్ని విత్తనము వేసి, నీరు కట్టక

పోయినను సర్వము వెలిచినవి. ఆయన సమస్తమును కలుగజేసిన మహాశక్తిని మనము ఊహింపజాలము. ఆయన సృష్టించుట మాత్రమే గాక సర్వమును నిర్వహించుచున్నాడు. "తన మహత్తుగల మాట చేత సమస్తమును నిర్వహించుచు" (హెబ్రీ 1:3). ఆయన ఒక్కమాట సెలవిచ్చుట ద్వారా ఆకాశములో ఉన్నవన్నియు వాని వాని స్థానములలో ఉంచబడుచున్నవి. ఆకాశమువైపు మనము చూచిన యెడల నక్షత్రములు ఆయా స్థలముల నాక్రమించి యుండుట గమనించగలము. ఆ స్థలముల నాక్రమించుకొనుమని వాటికి ఆజ్ఞాపించిన దెవరు?

యేసుక్రీస్తు ప్రభువు యొక్క ఒక్క మాట ద్వారా సర్వసృష్టి నిర్వహించబడుచున్నది. అయినను ఒక్క మాట ద్వారానే అవియన్నియు అంతరించి పోవునని చెప్పబడినది. "అవి నశించునుగాని నీవు నిలిచియుందువు. అవన్నియు వస్త్రమువలె పాతగిల్లును. ఉత్తరీయమువలె వాటిని మడిచివేతువు అవి వస్త్రమువలె మార్చబడును" (హెబ్రీ 1:11, 12). పనికిరాని వస్తువులను మనము పారవేయునట్లు యేసు ప్రభువు పాతసృష్టిని పారవేయును.

సమస్తమును సృష్టించుటకు, వాటిని నిర్వహించుటకు, అంతరింపచేయుటకు యేసుక్రీస్తు ప్రభువు ఎంత బలమైన శక్తిని కలిగియున్నాడో ఊహించుము. ఆయన దేవుని మహిమయొక్క తేజస్సును దేవుని తత్వము యొక్క మూర్తిమంతమునై యున్నాడు

(హెబ్రీ 1:3). "ఏలయనగా దేవత్వము యొక్క సర్వ పరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది" (కొలొస్స 2:9). దూతలందరికన్న ఆయన గొప్పవాడు, "దేవదూతల కంటె ఎంత శ్రేష్ఠమైన నామము పొందెనో వారికంటె అంత శ్రేష్ఠుడై" (హెబ్రీ 1:4). దేవదూతలు బలముగా, ప్రకాశవంతముగా, మెరయుచు అధికసంఖ్యలో నున్నారు. వారందరికన్న యేసుక్రీస్తు ప్రభువు ఎంతో ఉన్నతమైనవాడు, గొప్పవాడు. దూతలందరు ఆయన ఆధీనములో నున్నారు. "యెహోవా దూతలారా, ఆయన ఆజ్ఞకు లోబడి ఆయన వాక్యము నెరవేర్చు బలశూరులారా ఆయనను సన్నుతించుడి" (కీర్తన 103:20).

ఈ మహారక్షణను అట్టి మహా రక్షకుని ద్వారా పొందుచున్నాము. ఒక గొప్ప రాజు ఎవరికైన వర్తమానము అందజేయగోరిన యెడల, అతడు వ్యక్తిగతముగా వెళ్లడు. ఒక నమ్మకమైన, విశ్వాసనీయుడైన వ్యక్తిని ఎన్నుకొని అతనిద్వారా అందజేయును. అయితే ఆ విషయము అత్యవసరమైనదియును, అతి ప్రాముఖ్యమైనదియునైన యెడల అతడే వ్యక్తిగతముగా వెళ్లును. యేసుక్రీస్తు ప్రభువు తన దూతను పంపలేదు గాని, ఆయనే ఈ రక్షణను మనకొరకు తెచ్చెను.

దేవుని వర్తమానము యొక్క గొప్పతనమును స్థిరపరచుటకు అనేక సాధనములను ఉపయోగించెను. "దేవుడు తన

చిత్తానుసారముగా సూచక క్రియల చేతను, మహత్కార్యముల చేతను, నానావిధములైన అద్భుతములచేతను, వివిధములైన పరిశుద్ధాత్మ వరములను అనుగ్రహించుటచేతను, వారితో కూడ సాక్ష్యమిచ్చుచుండగా వినినవారిచేత మనకు దృఢపరచబడెను" (హెబ్రీ 2:4). యేసుక్రీస్తు ప్రభువు చేసిన మహత్కార్యములన్నియు ఆయన మహారక్షకుడని స్థిరపరచుచున్నవి. ప్రభువు యొక్క శక్తి ఎంతో గొప్పది, గనుక ఆయన ఏమి పలికినను ఆ ప్రకార మాయెను. ఒకప్పుడు సముద్రములో గొప్ప తుఫాను రేగెను, ఆయన శిష్యులు ఎంతో భయపడుచుండిరి. వారి దోనెలోనికి నీళ్లు వచ్చుచుండెను. ప్రభువు ఒక గద్దింపుమాట పలికిన వెంటనే గాలి అణగెను. అంతయు నిమ్మళమాయెను (మార్కు 4:39). అట్టి రక్షకుని అలక్ష్యము చేయుటకు మనము ఎంత బుద్ధిహీనులమో గదా! ఆయనను బహు చులకనగా ఎంచుచుందుము. ఆయన మహాత్మ్యమును, ఆ మహారక్షణను గ్రహించుటకు చాలినంత సమయము మోకాళ్ల మీద మనము గడుపుటలేదు. మనయొద్ద విలువైన వస్తువు ఏదైన ఉండిన యెడల, బహు జాగ్రత్తగా దానిని దాచిపెట్టి, దానిని పలుమార్లు చూచుకొనుచుందుము. అయితే అట్టి మహా రక్షకుడు నెరవేర్చిన ఆ మహారక్షణ విషయమై జాగ్రత్త వహించకున్నాము. అది ఎంతో గొప్పది. కనుక మనకు పరిచారకులైన ఆత్మలుగా నుండుటకు దేవుడు తన దూతలను నియమించెను (హెబ్రీ 1:4). యేసుక్రీస్తు

ప్రభువు రెండవ పర్యాయము వచ్చిన దినముననే మనలో రక్షణ కార్యము సంపూర్ణమగును (ఫిలిప్పీ 1:6). అప్పుడు మనము అమర్త్య దేహములను పొందెదము. మనకు పరిచర్య చేయుమని ప్రభువు తన దూతలందరికి ఆజ్ఞాపించును. ఆ రక్షణ కార్యము సంపూర్ణమైనప్పుడు పరలోక రాజ్యములో ఏ భాగమునకైనను వెళ్లి మనకు పరిచర్య చేయుమని దూతల నాజ్ఞాపించగలము. దేవదూతలు బలమైనవారుగా ఎల్లప్పుడు దేవుని సన్నిధిలో నుండినను, అట్టి ఆధిక్యత వారికియ్యబడలేదు. వారు ఎడతెగక దేవుని స్వరము వినుచు, ఆయన చిత్తమునే జరిగించుచున్నారు. అట్టి దేవదూతలు మనకు పరిచర్య చేయు ఆత్మలు! ఎట్టి మహారక్షణ! ఎట్టి మహాఘనత! ఎట్టి గొప్ప అధిక్యత! ఎట్టి గొప్ప ప్రేమ! ఎట్టి గొప్ప కృప!

దేవుని మహా ప్రేమను తన అద్భుతమైన గ్రంథము, బైబిలు ద్వారాను, తన సేవకుల ద్వారాను మనకు బోధించుటకు ఆయన ప్రతి విధమైన ఏర్పాటును చేసెను. ప్రభువు మత్తయి 5:48లో ఈలాగనెను. "మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండెదరు." మహాప్రేమతో యేసుక్రీస్తు ప్రభువు మనలను పరిపూర్ణులుగా చేయుటకు బైబిలు గ్రంథమును అనుగ్రహించెను (2 తిమోతి 3:16,17). అందువలననే ఆయనను, ఆ మహారక్షణను అధికముగా ఎరుగుటకు అధిక సమయము

మోకాళ్లపై నుండి ఆయన వాక్యముతో గడపవలెను. "వీరు.. ఆసక్తితో వాక్యమును అంగీకరించి పౌలు సీలయు చెప్పిన సంగతులు ఆలాగున్నవో లేవో అని ప్రతి దినమును లేఖనములు పరిశోధించుచు వచ్చిరి" (అపొ.కా. 17:11). దేవుని, ఆయన సత్యములను బాగుగా ఎరుగు నిమిత్తము బెరయలో నున్న విశ్వాసులు లేఖనములను పరిశోధించి, దేవుని వాక్యమును బహు నిశితముగా పరిశీలించిరి. ఈ విషయములను గురించి అధికముగా ఎరుగు నిమిత్తము బైబిలులోని అన్ని భాగములను మనము చదువవలెను. లూకా 24:13-15లలో వ్రాయబడిన సందర్భములో యేసుక్రీస్తు ప్రభువు తనంతట తానే ఆ యిరువురి శిష్యులకు బోధించినను,. ఆ సమయములో వారు గ్రహించలేక పోయిరి. ఆయన వారి మనో నేత్రములను తెరచినప్పుడు మాత్రమే, వారు ఆయనను గుర్తుపట్టి, ఆయన శ్రమలు, మరణ, పునరుత్థాన భావమును గ్రహించగలిగిరి. ఆయన సౌందర్యమును చూడగలుగుటకు మన ఆత్మీయ నేత్రములు అధికముగా తెరువ బడవలెను. గనుకనే మత్తయి 13:16, 17లలో నున్నట్లు మనము ఎల్లప్పుడు ఈలాగున ప్రార్థించుచుండవలెను. "ఓ ప్రభువా, నిన్నును, నీ సత్యములను అధికముగా ఎరుగగల్గునట్లు నా మనో నేత్రములను తెరువుము." అయితే దానికి విశ్వాసము, దీనత్వము, పట్టుదల అవసరమై యున్నవి. కనుక ఎట్టి మహారక్షకుని మనము కలిగియున్నామో చూచు చున్నాము!

## రెండవ అధ్యాయము

# మన ఉన్నత పిలుపు : నూతన సృష్టి

మనలను రక్షించుటకును, ఉన్నతమైన పిలుపుతో మనలను పిలుచుటకును ప్రభువునకు గల బృహత్తరమైన ఉద్దేశమును గురించి అపొస్తలుడు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక రెండవ అధ్యాయములో వ్రాసెను. మనము హెచ్చరిక గైకొననియెడల, కారుచున్న పాత్రను బోలియుందుము. కొన్ని పర్యాయములు మట్టి పాత్రకు కంటికి కనబడని సన్నని పగులు ఉండి, దాని ద్వారా పాత్రలో పోసినవన్ని మెల్లగా కారి మటుమాయమైపోవును. మన రక్షణ విషయమై బహు జాగ్రత్తగాను, మెళకువగాను ఉండని యెడల గొప్ప నష్టమునకు గురికావలసి వచ్చును. మన రక్షకుడగు మన ప్రభువు తనను తాను రిక్తునిగా చేసికొని, తన సింహాసనమును, మహిమను విడచి పశువుల పాకలో జన్మింపవలసి వచ్చెను. మన నిమిత్తము ఆయన దరిద్రుడాయెను. విరుగగొట్ట బడుటకు తన శరీరమంతటిని, చిందింపబడుటకు రక్తమంతటిని యేసుక్రీస్తు ప్రభువు అప్పగించెను. మనకు రక్షకుడగుటకు ఆయన బయలుపరచిన శక్తి సర్వసృష్టిని కలుగజేయుటకును దానిని నిర్వహించుటకును, అంతమున దానిని నాశనము చేయుటకును బయలుపరచిన శక్తికంటె ఎంతో గొప్పదిగా నున్నది. అందువలననే ఆయన దృష్టిలో సర్వజగత్తు కంటె ఒక్క విశ్వాసి ఎంతో అమూల్యముగా నున్నాడు.

ఒక విశ్వాసి ఈ లోకములో ఎంతో బలహీనుడుంగా, పేదవాడుగా ఉండినను, అమర్త్య దేహముతో నిరంతరము జీవించనై యున్నాడు. బైబిలు గ్రంథములో విశ్వాసులు దేవుని విశేషమైన సొత్తు, విలువైన ముత్యము, దేవుని జతపనివారు, దేవునితో పాలివారు అను పేర్లతో ఉదహరింపబడిరి. ఆకాశము లకు ఇట్టి పేర్లు పెట్టబడలేదు. దేవుడు ఆకాశములను తన విశేషమైన సొత్తు, తన భాగము, తన పాలివారు లేక తన స్వాస్థ్యమని పిలుచుట లేదు. దేవదూతలకు సహితము ఈ పేర్లు పెట్టబడలేదు. "యెహోవా తనకొరకు యాకోబును ఏర్పరచు కొనెను. తనకు స్వకీయ ధనముగా ఇశ్రాయేలును ఏర్పరచు కొనెను" (కీర్తన. 135:4). యాకోబు అను పేరునకు మోసగాడు అని అర్థము. ఇశ్రాయేలు అనగా రాజకుమారుడు అని అర్థము. పాపులముగా మనము యాకోబు స్వభావమును కలిగియున్నాము గాని యేసుక్రీస్తు ప్రభువు చెంతకు వచ్చుట ద్వారా మనము ఇశ్రాయేలు గాను దేవుని శాశ్వతమైన స్వకీయ ధనముగాను మార్చబడుచున్నాము. మనలను రక్షించుటకు యేసు ప్రభువు తన సర్వస్వమును యిచ్చినందున మనలను రక్షించుటలో ఆయన ఉన్నత ఉద్దేశము కలిగి యుండెనని స్పష్టమగుచున్నది. పాపములను బట్టి మనము మురికి గుడ్డవలె నుండినను క్రీస్తు ప్రభువు మనలను తనకు స్వకీయ ధనముగా చేసికొనెను.

హెబ్రీ 2:5లో రాబోవు లోకము లేక నూతన సృష్టిని గురించి

అపొస్తలుడు వ్రాసెను. ఆ నూతన సృష్టి నిత్యత్వమంతటను దేవుని మహిమను బయలు పరచుచుండును. నూతన సృష్టిలో మరణము గాని నొప్పి గాని కన్నీరుగాని ఇక ఏ మాత్రమును ఉండవు (ప్రకటన 21:3-5). అందులో శాపగ్రస్తమైనదేదియును ఉండదు. యుగయుగములు అది నిలిచియుండును. అయితే ఆ నూతన సృష్టిని దేవుని దూతలు ఏలబోవుట లేదని చదువుచున్నాము (హెబ్రీ 2:5). దేవుని దూతలు బలమైన వారుగా ఎల్లప్పుడు దేవుని చిత్తమునే జరిగించుచు ఆయనకు యిష్టమైన పనులనే చేయువారైనను, ఆ నూతన సృష్టిని యేసుక్రీస్తు ప్రభువు వెదకి రక్షించినవారు మాత్రమే ఏలెదరు. కీర్తన 103:20లో దేవుని దూతలు ఆయన ఆజ్ఞకు లోబడి ఆయన వాక్యము నెరవేర్చు బలశూరులని చూచుచున్నాము. వారు తిరుగుబాటు చేయరు, అవిధేయులు కారు, వారు బలమైనవారు, ప్రకాశమైనవారు (లూకా 24:4). వారు కోట్లకొలదిగానున్నారు (ప్రకటన 5:11). అయినను లేఖనముల ప్రకారము దేవుని మహిమతో నిండియుండు రాబోవు నూతన సృష్టిని దేవుని దూతలు ఏలుబడి చేయరు. హెబ్రీయులకు వ్రాసిన పత్రిక మొదటి అధ్యాయములో దేవుని దూతలు మనకు పరిచర్య చేయుటకు పంపబడిన ఆత్మలని చూచితిమి. ఒక దినమున యేసుక్రీస్తు ప్రభువు రాబోవు నూతన సృష్టి యొక్క మహిమను గురించి కొంత తెలియజేయుటకు తన దూతల నందరిని సమకూర్చెనని ఊహించుము. రాబోవు సృష్టియొక్క మహిమను గురించి వారికి చెప్పబడినప్పుడు వారు బహుగా ఆశ్చర్య మొందెదరు. ఆ నూతన సృష్టిని ఆయన కృప ద్వారా

వెదకి రక్షించిన మానవులే ఏలబోవుచున్నారు గాని దేవుని దూతలు కాదని కూడ ప్రభువు వారికి బయలుపరచును. యూదా పత్రిక 24వ వచనము ప్రకారము ఒక దినమున మనము నిర్దోషులముగా దేవుని యెదుట నిలువబెట్ట బడనైయున్నాము. అప్పుడు మనము దేవుని దూతలకు మించిన మహిమను కలిగి యుందుము. అట్టి పిలుపును, పదవిని మన కనుగ్రహించుటకు క్రీస్తు ప్రభువు తనను తాను రిక్తునిగా చేసికొని తన ప్రశస్త రక్తముతో మనలను కొనెను.

ప్రభువు కోరిన పక్షమున, ఆయన దేవుని దూతవలె ఈ లోకములోనికి వచ్చి యుండవచ్చును. అయితే విశేషమైన ఉద్దేశముతో ఆయన మనవంటి వాడాయెను (హెబ్రీ 2:16, 17). ఆయన మానవునికి రాగల సాధ్యమైన సమస్త విధములగు శోధనలను, సాతానును నలుబది దినములు తన యెదుటికి ఆయన రానిచ్చెను (లూకా 4:1, 2). మన నిమిత్తము ఆ శోధనల నన్నింటిని ఆయన జయించెను. కనుక సరిగా మనము ఎట్టి శోధనను ఎదుర్కొనుచుందుమో ఆయన ఎరుగును. బలహీనత గాని లేక శోధనను గాని మనము ఎదుర్కొనునప్పుడెల్లను, దానిని జయించుటకు ప్రభువు మనకు సహాయముచేయును. ఆయన కృప, ప్రేమ ప్రశస్తరక్తముల ద్వారా అనుదినము మనము ఆయన సారూప్యములోనికి మార్చబడుచున్నాము. ఒక దినమున ఆయనను చూచెదము. అప్పుడు ఆయనను పోలియుండెదము. ఆయన మహిమలోను, సౌందర్యములోను పాలు పొందెదము. ఆ మహిమతో నూతన సృష్టిని ఏలెదము. ఇప్పుడు భూమిమీద

మనకు కలుగుచున్న పరీక్షలు, శోధనలు, శ్రమలు ఆ నూతన సృష్టి కొరకు మనలను సిద్ధపరచుచున్నవి. ఎంత బుద్ధిహీనుల మైనను మనలను రక్షించుటలో ప్రభువు ఎట్టి ఉన్నత ఉద్దేశమును కలిగియున్నాడో గదా!

భాగ్యవంతులైన తలిదండ్రులు కొందరు తమ పిల్లల నిమిత్తము ఉన్నత ఉద్దేశములు కలిగి యుందురు. జీవితములో ఉన్నతస్థాయికి రావలెనని కోరుచుందురు. అయితే నీవు పెద్దవాడైనప్పుడు ఏమి చేయగోరుదువు అని ఆ పిల్లవానిని అడిగిన యెడల, నేను పోలీసువాడను కాగోరుచున్నానని జవాబు చెప్పును. కారణమేమని ప్రశ్నించిన యెడల, ఆ పిల్లవాడు ఈలాగున చెప్పును. "రోడ్డుమీద వచ్చిపోవు బండ్లను ఆపివేయగలను." తండ్రి తమ జీవితముల కొరకు కలిగియున్న గొప్ప ఉద్దేశములను చిన్న పిల్లలుగా గ్రహించలేరు. మనము కూడ కొన్ని పర్యాయములు పరలోకపు తండ్రి మన యెడల కలిగియున్న గొప్ప ఉద్దేశములను గ్రహింపలేకున్నాము. వారిని రక్షించుటలో దేవుని గొప్ప ఉద్దేశమును గ్రహించలేక పోయినందున విశ్వాసులనేకులు ఈ భూమిమీద భిక్షగాండ్రవలె నుండి ఓటమి, అవమానములతో నిండియున్న జీవితములను కొనసాగించుచున్నారు. "ఇంత గొప్ప రక్షణను మనము నిర్లక్ష్యము చేసిన యెడల ఏలాగు తప్పించుకొందుము?" మన రక్షణ విషయమై అజాగ్రత్తగా, నిర్లక్ష్యపరులముగా నుండిన యెడల ఎంత గొప్ప నష్టమును పొందుదుమో గదా! మనము కనిపెట్టుచు, ప్రార్థనా పరులముగా మెళకువతో, జాగ్రత్తగా నుండవలెను.

## మూడవ అధ్యాయము

# మన ఉన్నత పిలుపు : దేవుని పాలివారము

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక మూడవ అధ్యాయములో రక్షణ పొందుట ద్వారా యేసుక్రీస్తు ప్రభువులో ఆత్మీయముగా పాలిభాగస్తులమగుచున్నామని చూడగలము. మన పాపములు క్షమింపబడి, పరలోకములో ఒక స్థలమును పొందుటయే గాక, ఆత్మీయముగా అన్నిటిలో ఆయనతో పాలివారమగుచున్నాము. ఈలాగున పాలివారమగుట ఎంతో అసమానమైనది. బైబిలునందు ఆయాచోట్ల దేవుని జతపనివారము, తోడిపనివారము అని పేర్కొనబడుచున్నాము (1కొరింథీ 3:9; 2 కొరింథీ 6:1). దేవుని దూతలు బలమైనవారుగా, ప్రకాశించుచు కోట్లకొలదిగా నుండినను, వారికి ఈ ఆధిక్యత యివ్వబడలేదు. లేఖనములలోఎక్కడను దేవుని దూతలు దేవుని జతపనివారుగా లేక తోడిపనివారుగా పేర్కొనబడలేదు. ఆయన కొరకు నిత్య నివాసమును నిర్మించు నిమిత్తము యేసు క్రీస్తు ప్రభువు యొక్క ప్రశస్త రక్తముతో కొనబడిన విశ్వాసులమైన మనము ఆయనతోడి పనివారమైతిమి. ఇది గొప్ప మర్మము. ఆకాశ మహాకాశములు సహితము పట్టజాలని మహామహుడు దేవుడు; అయినను మానవ మాత్రులమైన మనము ఆయనకు పరిశుద్ధ స్థలమును లేక నివాస స్థలమును కట్టవలెనని కోరుచుండెను. ఆ ఉద్దేశముతోనే ఆయన తన ప్రజలను ఐగుప్తునుండి కనానుకు నడిపించెను. ఆయన

పది తెగుళ్లను ఐగుప్తుమీదికిని, ఫరో మీదికిని పంపి తన బలమైన హస్తముతో ఇశ్రాయేలీయులను ఐగుప్తునుండి విడిపించెను. వారికి ముందుగా వెళ్లుటకును, వారిని నడిపించుటకును తన స్తంభమును ఆయన పంపెను. రాత్రి అగ్ని స్తంభము ద్వారాను, పగలు మేఘ స్తంభము ద్వారాను వారిని నడిపించెను. అగ్ని స్తంభము ఇశ్రాయేలీయులకు వెలుగు నిచ్చెను. అయితే ఐగుప్తీయులకు చీకటిగా నుండెను. ఎఱ్ఱ సముద్రము ఎట్లు పాయలాయెనో వారు చూచిరి. వారికొరకు అనేక మహత్కార్యములను ఆయన చేసెను. ఇన్ని జరిగినను ఆయన వారి మధ్య నివసించలేదు. ఆయన బలమైన దేవుడు. ఆయన ఈలాగనెను, "నేను వారిలో నివసించునట్లు వారు నాకు పరిశుద్ధ స్థలమును నిర్మించవలెను" (నిర్గమ కాండము 25:8).

ఒక ఇంటికిని, నివాస స్థలమునకును తేడా కలదు. 'ఇల్లు' అనగా ఆయా వస్తువులు గల కట్టడము, కాని మన ప్రియులు నివసించు స్థలము గృహము. 'నేను ఇంటికి వెళ్లుచున్నాను' అని చెప్పుదుము. ఒక అస్పత్రిని గాని, కళాశాలను గాని, కర్మాగారమును గాని లేక విశ్వవిద్యాలయమును గాని ఇల్లు అని పిలువము. మన తల్లి, తండ్రి, భర్త లేక భార్య, పిల్లలు కలిసి నివసించునదే గృహము. గృహములో ప్రేమ యుండును. ఒక కట్టడము లేక అందులోనున్న సామగ్రి ఇల్లు కాదు. దేవుడు ప్రేమా స్వరూపి, ఆయన ప్రేమ శాశ్వతమైనది. ఆయన ప్రేమ ఎంతో గొప్పది. యిర్మీయా 31:3లో ఆయన ఈలాగనెను. 'శాశ్వతమైన ప్రేమతో

నేను నిన్ను ప్రేమించుచున్నాను.' దేవుని ప్రేమ మనలో పోయబడెను. ఒక ప్రేమ గల తండ్రి తన ప్రేమను తన పిల్లలపై కుమ్మరించ గోరునట్లుగా, దేవుని ప్రేమ మన హృదయములలో కుమ్మరించబడియున్నది. దేవుని ప్రేమ, కొండమీద, చెట్లమీద, లేక సూర్య చంద్రాదులమీద కుమ్మరింపబడనేరదు. అదే రీతిగా ఆయన ప్రేమను దేవుని దూతలు పొందుటలేదు. ఒక దాసుడు మంచి నమ్మకమైనవాడుగా నుండవచ్చును. అయినను భార్యా పిల్లలకు చూపించెడి ప్రేమ ఆ దాసునికి చూపించలేము. నీవు ఎంత ప్రయత్నించినను ఒక వ్యక్తి తన భార్యా పిల్లలకు చూపించు ప్రేమను, తన దాసులకు ఏమాత్రమును చూపించలేడు. అలాగుననే దేవుని ప్రేమ యేసుక్రీస్తు ప్రభువు కొనిన వారి కొరకు మాత్రమే చూపించబడగలదు. దేవుని దూతలు తిరిగి జన్మించిన వారికి దేవునిచేత పంపబడిన పరిచారకులైన ఆత్మలుగా నున్నారు. దేవుడు తన కొరకు నిత్యమైన నివాస స్థలము కావలెనని కోరుచున్నాడు. మనమే దేవుని నివాస స్థలము లేక దేవుని ఇల్లు అని అపొస్తలుడు పిలుచుచున్నాడు. మనము దేవుని నివాస స్థలముగా కట్టబడుచున్నాము. 'యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలుల నర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు, మీరును సజీవమైన రాళ్లవలె నుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు (1 పేతురు 2:5).

దేవుని ఇంటికి పరిశుద్ధాత్మ - పరిశుద్ధ స్థలము, దేవుని నివాస

స్థలము, దేవుని ఆలయము, ఆత్మీయ మందిరము అను వివిధమైన పేర్లనిచ్చెను. అయితే మర్మమైన విషయమేమనగా అట్టి నిత్యమైన నివాస స్థలము నిమిత్తము దేవునికి నీవు, నేను అవసరమై యున్నాము. మనము ఎంత బలహీనముగా, బుద్ధిహీనముగా నున్నను, అట్టి ఇంటి కొరకు దేవుడు మనలను కోరుచున్నాడు. ఒక భాగ్యవంతుడు తన ఇంటిని కట్టుకొనునప్పుడు చాల విలువైన సామగ్రిని ఉపయోగించును. ఒక రాజు భవన నిర్మాణము కొరకు ప్రపంచ మంతటినుండి అతి శ్రేష్ఠమైన సామగ్రిని తెప్పించును. అయితే యేసుక్రీస్తు ప్రభువు దేవుని ఇంటిని కట్టుటకు మురికి గుడ్డను, అపవిత్రమైన దానిని, ఎండిపోయిన ఆకును ఎన్నుకొనుచున్నాడు. ఆయన చెంతకు వచ్చినప్పుడు మనస్థితి కూడ అలాగునే ఉండెను. ఆయనే మనలను కొనినందున, ఆయనకు ఎంతో అమూల్యమైన వారమైతిమి. మర్మమేమనగా మనము ఎంత బుద్ధిహీనుల మైనను, బలహీనులమైనను ప్రతి యొక్కరము ఆయన నిత్య నివాస మందిరములో ఒక భాగము కాగలము.

మోషే కట్టించిన మందిరము దేవుడు చూపించిన మాదిరి ప్రకారముగా నుండెను. ఇప్పుడు యేసుక్రీస్తు ప్రభువు నిర్మించుచున్న మందిరమునకు లేక ఇంటికి అది ఒక ఛాయగా మాత్రమే నుండెను. మోషే కుండిన జ్ఞానమంతటిని ఖాళీ చేయుటకు దేవుడు అతనిని అరణ్యములో నలుబది సంవత్సరములును, పర్వతము మీద నలుబది దినములును

ఉంచెను. ఆ పర్వతము మీద దేవుడు అతనికి కట్టవలసిన ఇంటికొరకు పరలోక మాదిరిని అనుగ్రహించి, చూపించబడిన మాదిరి ప్రకారముగానే కట్టవలెనని అతనిని హెచ్చరించెను (నిర్గమ 25:40). ప్రత్యక్ష గుడారపు నిర్మాణము నిమిత్తము ప్రతి వివరము మోషేకు చూపించబడెను. మోషే గాని మరి యితరులు ఎవరైనను ఆ మాదిరిని మార్చలేరు. 'యెహోవా మోషేకు ఆజ్ఞాపించినట్లు' అను మాటలు ఎనిమిది పర్యాయములు నిర్గమ కాండము నలుబదియవ అధ్యాయములో చెప్పబడినవి. ప్రత్యక్ష గుడారపు నిర్మాణములో దేవుడు ఇచ్చిన ప్రతి వివరమును మోషే పాటించెను. కేవలము అప్పుడు మాత్రమే దేవుని మహిమ ప్రత్యక్ష గుడారమును నింపగలిగెను. ఇప్పుడు యేసుక్రీస్తు ప్రభువు, మనము ఆయనతో పాలివారమై యుండగా, ఆత్మ మందిరమును కట్టుచున్నాడు. ఈ మాదిరిలో మనమెవరమును ఎట్టి మార్పును చేయకూడదు. భౌతిక సంబంధమైన మందిరమును కట్టుటలో మోషే ఎట్టి మార్పును చేయలేక పోయెను గదా. ఆత్మమందిరములో ఎట్లు మనము మార్పు చేయగలము? అయితే దేవుని సేవకులు అనేకులు కొన్ని మార్పులు చేసి, దేవుని పనిని మానవ జ్ఞానముతో చేయుచుందురు. అందువలననే వారి మధ్యలో ఓటమి, పతనము, నిష్ఫలిత స్థితి, అంధకారము కనబడుచున్నవి. ఆయన ఇంటిని కట్టుటలో జాగ్రత్తగా నుండవలెనని దేవుని వాక్యము మనలను హెచ్చరించుచున్నది. ఈ దినములలో క్రైస్తవులు, బాప్టిస్టులు, మెథడిస్టులు, మెనోనైట్లు, ఆంగ్లికన్లు, ప్రెస్బిటేరియన్లు మొదలగు అనేక తెగలుగా

విభాగింపబడియున్నారు. సంఘము యొక్క రాజ్యాంగము పేరున ప్రజలు అనేక మార్పులను చేసిరి. అంధకారము, తప్పుడు బోధలు నెమ్మదిగా సంఘములోనికి ప్రవేశించినవి. దేవుని ఆత్మ మందిర నిర్మాణములో మనము పాలివారము కాగోరిన యెడల మొట్టమొదట యేసుక్రీస్తు ప్రభువు యొక్క శిరసత్వము క్రిందికిని, ఆయన ప్రభుత్వము క్రిందికిని, ఆయన యాజమాన్యము క్రిందికిని మనము రావలెను. ఒక పెద్ద భవనమును కట్టుచున్నప్పుడు ముఖ్య ఇంజనీరు దగ్గర ఆ భవనపు నమూనా యుండును. తాపీ పనివారు, ఇతర పనివారు అతని క్రింద పనిచేయుచుందురు. ముఖ్య ఇంజనీరు చెప్పిన విధముగానే వారు చేయవలెను. అలాగుననే మన వ్యక్తిగత, కుటుంబ, సంఘ జీవితము యేసుక్రీస్తు ప్రభువుయొక్క సంపూర్ణ శిరసత్వము, ప్రభుత్వము, యాజమాన్యము క్రిందను ఉండిన యెడల అనుదినము నడుపుదల కొరకు దేవుని స్వరమును వినగలిగెదము. కాని ఏ పాపము చేతనైనను అపవిత్రపరచ బడిన యెడల, ఆత్మీయముగా చెవిటివారమై, దేవుని స్వరమును వినలేక పోదుము. అందువలననే అనేకులు ఆత్మీయముగా చెవిటివారై పోయిరి. వారి చెవులు మూసికొని పోయినందున దేవుడు చెప్పగోరు దానిని గ్రహించలేకున్నారు. అంతేగాక ఆత్మీయముగా గ్రుడ్డివారగుచున్నారు. దేవుని ఏర్పాటును వారు ఎరుగకున్నారు. మన వ్యక్తిగత, కుటుంబ, సంఘ జీవితములలో యేసుక్రీస్తు ప్రభువు యొక్క శిరసత్వమును అంగీకరించుట ద్వారా మాత్రమే దేవుని చిత్తమును తెలిసికొనగలము. అప్పుడు దేవుని నిత్య

నివాసమును కట్టుటలో పాలివారము కాగలము. అదే సమయములో దేవునిసర్వ సంపూర్ణతను అనుభవించెదము. ప్రేమ సంపూర్ణముగా ఆయన ఇంటిలో బయలుపడును. ఆయన శిరసత్వము క్రింద ఆయన నిత్య నివాసమును కట్టుటకు యేసుక్రీస్తు ప్రభువుతో నిజమైన జత పనివారముగా నుండుటకు మనలో ప్రతి ఒక్కరికి పరలోకపు పిలుపు గలదు. ఆయన శిరసత్వమును, ఆయన ప్రభుత్వమును అంగీకరించిన యెడల ఆ మహిమాయుక్తమైన పరిశుద్ధస్థల నిర్మాణములో మన భాగమును తీసికొనగలము.

## నాల్గవ అధ్యాయము

# గొప్ప ఆధిక్యత

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక నాల్గవ అధ్యాయములో ఆ మహారక్షణను బట్టి ప్రభువునకు మనము ఏలాగున మొఱ్ఱపెట్టగలమో చూచుచున్నాము (హెబ్రీ 4:16). దేవుడు మనలను రక్షించుటలో, రాబోవు నూతన సృష్టియందు రాజులుగా, అధిపతులుగా మనలను చేయవలెనను గొప్ప ఉన్నత ఉద్దేశము కలిగియున్నట్లుగా చూచితిమి. యేసుప్రభువు యొక్క ప్రశస్త రక్తముతో విమోచింపబడిన వారెల్లరు అట్టి అధిక్యతను కలిగియున్నారు (ప్రకటన 5:9, 10). ఆ ఉద్దేశముతోనే మన సమస్త అక్కరలు, కొరతలు, బలహీనతల నిమిత్తము ఆయన కృపను అందుబాటులో నుంచెను. ఆయన కృపా సింహాసనము యెదుటికి వచ్చుట ద్వారా ఆయన కృపను పొందగలము. మన పరీక్షలు, శోధనలు, శ్రమలు కష్టములు ఏమైనను ఆయన కృప మనకు చాలును. మన అక్కర గొప్ప పర్వతమువలె నుండినను విశ్వాసముతో ధైర్యముగా, ఆయన కృపాసనము నొద్దకు రమ్మని యేసుక్రీస్తు ప్రభువు ఆహ్వానించుచున్నాడు. అందువలననే దేవుని కృపను ఏలాగు పొందవలెనో, దానినెట్లు అనుభవించవలెనో అధికముగా మనము తెలిసికొనవలెను.

మానవ యోగ్యతలతో గాక ఆయన కృప ద్వారానే మన క్రైస్తవ జీవితమును ఆరంభించుచున్నాము. దేవుడు శాశ్వతమైన నీతిని కోరుచున్నాడు. మన నీతికి, దేవుని నీతికి ఎట్టి పోలిక లేదు. ఆ మహారక్షణ పొందుటకు మనలో ఎవరికి ఏ కొద్ది యోగ్యతయైనను లేదు. కేవలము దేవుని కృప ద్వారాను, యేసుక్రీస్తు ప్రభువు యొక్క ప్రశస్త రక్తము యొక్క శక్తియందు విశ్వాసముంచుట ద్వారా మాత్రమే రక్షణను పొంది, దేవుని మహిమను, ఆయన కృపను వెల్లడి చేయగలము (ఎఫెసీ. 2:5, 8). 1 కొరింథీ 15:10 లో అపొస్తలుడైన పౌలు ఈలాగు సాక్ష్యమిచ్చుచున్నాడు. "అయినను నేనేమై యున్నానో అది దేవుని కృపవలననే అయియున్నాను." దీని భావమేమనగా అతడు ప్రభువు కొరకు చేసినది, శ్రమపడినదియంతయు కేవలము దేవుని కృపద్వారా మాత్రమే, దేవుని సేవకుడుగా అనేక శ్రమల ద్వారా అతడు వెళ్లవలసి వచ్చెను. ఆయన కృపయొక్క సంపూర్ణ భావమును అతనికి నేర్పించుటకు బాధకరమైన ముల్లు నొకదానిని ప్రభువు ఇతని శరీరములో ఉండనిచ్చెను. దానిని తీసివేయుమని అతడు ప్రభువును ముమ్మారు వేడుకొనెను. ఆ ముల్లు ఏమిటో మనమెరుగము, గాని అది మిక్కిలి బాధకరమైనది. దేవుని ప్రత్యుత్తరమేమనగా, "నా కృప నీకు చాలును." అందువలననే ఆ తరువాత ఈలాగున సాక్ష్యమిచ్చుచున్నాడు. "కాగా క్రీస్తు శక్తి నామీద నిలిచి యుండు నిమిత్తము విశేషముగా నా బలహీనతలయందే

బహుసంతోషముగా అతిశయపడుదును. నేనెప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను" (2కొరింథీ, 12:9, 10). ఆయన కృప యొక్క భావమును మనకు నేర్పించుటకును, ఆయన కృపను మనము అనుభవించ గల్గునట్లును మనకు శ్రమలనన్నిటిని దేవుడు రానిచ్చుచుండెనని చూడగలము.

ఆయన కృపను చేపట్టుట ద్వారా లోకమంతటిలో అతిబలహీనుడైన విశ్వాసి సహితము శక్తిమంతుడు కాగలడు. కృపాసనము నొద్దకు ధైర్యమైన ప్రవేశము మనకు ఉన్నందున మన కొరతలను బట్టి గాని లేక బలహీనతలను బట్టి గాని మనము నిరుత్సాహముతో కృంగిపోనవసరములేదు. మన నిమిత్తము ప్రభువు ప్రతి విధమైన శోధన ద్వారా వెళ్లినను పాపము లేనివాడుగా నుండెను. అందువలననే ఆయన ఇప్పుడు మన సమస్త మానవ బలహీనతల విషయమై విజ్ఞాపన చేయుచున్నాడు. నా శక్తి తరిగిపోవుట, శోధనలు నన్ను మించినవిగా నుండుట, విశ్వాసము సన్నగిల్లి పోయి అనుమానములు నా హృదయమును నింపి వేయుట నేను కనుగొన్నప్పుడు నేనీలాగందును. "యేసుక్రీస్తు ప్రభువా! నీవే నా ప్రధాన యాజకుడవు. దయచేసి నా పక్షమున విజ్ఞాపన చేసి, నన్ను పైకి లేవనెత్తుము. నీ సమృద్ధియైన కృపను నాకు ప్రసాదించుము." అప్పుడు ఆయన నాకు ధైర్యమును, విశ్వాసమును, బలమును అనుగ్రహించును.

దయచేసి మీ పరలోకపు పిలుపును గుర్తించుడి. నీవు ఎంత బలహీనుడవైనను, ఆయన సింహాసనమునకు నిన్ను తెచ్చుటకు ప్రభువు ప్రతివిధమైన ఏర్పాటు చేసెను. నీకు సందేహమున్న యెడల, ప్రధాన యాజకుడైన యేసుక్రీస్తు ప్రభువు యొక్క విజ్ఞాపన పరిచర్యను కోరుకొనుము. నీవు ఎదుర్కొనుచున్న శోధనలనే ఆయన కూడ ఎదుర్కొనెనని నమ్ముము. నీవు ఎట్టి పరిస్థితులలో నున్నావో ఆయన పూర్తిగా ఎరుగును. కనుక ఆయన కృప సంపూర్ణముగా చాలినదిగా వున్నది. మన పరలోకపు పిలుపు నిమిత్తము ఆ కృపను కోరుటకు ప్రభువు మనకు నేర్పించును గాక!

## ఐదవ అధ్యాయము

# గొప్ప ప్రధాన యాజకుడు

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక ఐదవ అధ్యాయములో మన యేసుక్రీస్తు ప్రభువును నాలుగంతల పరిచర్యలో మెల్కీసెదెకు యొక్క క్రమము చొప్పున పరలోకపు గొప్ప ప్రధాన యాజకుడుగా చూచుచున్నాము.

మొదటిగా, మన కొరతలన్నిటి నిమిత్తము మన పక్షముగా ఆయన విజ్ఞాపన చేయుచుండెను. ఆయన మన ఉత్తరవాది. "నా చిన్న పిల్లలారా, మీరు పాపము చేయకుండుటకై యీ సంగతులను మీకు వ్రాయుచున్నాను. ఎవడైనను పాపము చేసిన యెడల నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది తండ్రియొద్ద మనకున్నాడు" (1 యోహాను 2:1). ఆయన కరుణ గల నమ్మకమైన ప్రధాన యాజకుడు గనుక మన పక్షమున విజ్ఞాపన చేయుచుండెను. మనమందరమును బుద్ధిహీనత, బలహీనతలవలన దేవుని దుఃఖపరచు కార్యములను చేయుచుందుము. తప్పుడు పనులు చేయుటకు మనకు యిష్టము లేకపోయినను శత్రువు మనలను శోధనలోనికి లాగుచుండును. యేసుక్రీస్తు ప్రభువు మన బలహీనతలు, పతనములు ఎరిగియుండి మన పక్షముగా విజ్ఞాపన చేయుచుండును.

రెండవదిగా, పాత నిబంధన కాలములో ప్రజల పక్షముగా ప్రధాన యాజకుడు దేవునికి బలులు అర్పించవలసి యుండెను. ఈ బలులు యేసుక్రీస్తు ప్రభువును ఐదు విధములుగా సూచించినవి. మొదటిదిగా, వారు అర్పించిన దహన బలులు యేసుక్రీస్తు ప్రభువు యొక్క సంపూర్ణ బలిని సూచించినవి. రెండవదిగా, పాప పరిహారార్థ బలి; మన రక్షకుడుగా నుండు నిమిత్తము యేసుక్రీస్తు ప్రభువు మన సమస్త పాపములను తనపై మోసిన విధమును జ్ఞాపకము చేయుచుండెను. మూడవదిగా, సమాధానబలి: యేసుక్రీస్తు ప్రభువు మన సమాధానముగా మారి దేవునితో ఎట్లు మనలను సమాధాన పరచెనో సూచించుచున్నది. నాల్గవదిగా, అపరాధ పరిహారార్థ బలి: తిరిగి జన్మించిన తరువాత కూడ మనము చేయు పాపములను క్షమించి శుద్ధీకరించుటకు సంపూర్ణ ఏర్పాటును యేసుక్రీస్తు ప్రభువు చేసెనని జ్ఞాపకము చేయుచున్నది. ఐదవదిగా, నైవేద్య బలి: మన ఆకలిదప్పులు తీర్చి మనలను తృప్తి పరచుటకు యేసుక్రీస్తు ప్రభువు మనకు భోజనముగాను, పానీయముగాను మారెనని చూపించుచున్నది. యేసుక్రీస్తు ప్రభువు మన పక్షముగా ఈ ఐదు బలులు ఆయెను. ఒక్క పరిపూర్ణమైన బల్యర్పణ ద్వారా ఆయన మనలను నీతిమంతులనుగా చేసెను. విశ్వాసము ద్వారా మనము ఈలాగున పలుకుచుండవలెను. 'ప్రభువా! నీవే నా దహనబలి. నీవే నా పాప పరిహారార్థ బలి, నీవే నా సమాధాన బలి. నీవే నా అపరాధ పరిహారార్థ బలి, నీవే నా నైవేద్య బలి.'

మూడవదిగా, దేవుని చిత్తమును కనుగొనగోరువారికి ప్రధాన యాజకుడు సహాయము చేయుచుండెను. అతని న్యాయవిధాన పతకములో ఊరీము, తుమ్మీము అను రాళ్లు కలవు. ఈ రెండు రాళ్ల ద్వారా అతడు దేవుని చిత్తమును కనుగొనగలిగెను. ఈ ప్రశస్త రత్నములు ఎట్లు పనిచేసెనో తెలియకపోయినను వాటి సహాయముతో ప్రధాన యాజకుడు దేవుని చిత్తమును కనుగొనగలిగెనని మాత్రము మనమెరుగుదుము (1 సమూయేలు 23:9-12). యేసుక్రీస్తు ప్రభువు మనయందు జీవించుచున్న మన గొప్ప పరలోకపు ప్రధాన యాజకుడు. మనము నేరుగా ఆయనతో మాటలాడి మనకొరకు దేవుని చిత్తమును కనుగొనవచ్చును.

నాల్గవదిగా, మన గొప్ప ప్రధాన యాజకుడుగా పరమాహారమును మనకు అనుగ్రహించును. మెల్కీసెదెకు యాజకుడుగా ఆదికాండము 14:18లో అబ్రాహామునకు ప్రత్యక్షమాయెను. "మరియు షాలేము రాజైన మెల్కీసెదెకు రొట్టెను ద్రాక్షారసమును తీసికొని వచ్చెను. అతడు సర్వోన్నతుడగు దేవునికి ప్రధాన యాజకుడు." ఆయన ఎచ్చట నుండి వచ్చెనో ఎవరికిని తెలియదు. 'అతడు తండ్రిలేనివాడును తల్లిలేనివాడును, వంశావళి లేనివాడును, జీవితకాలమునకు ఆదియైనను జీవమునకు అంతమైనను లేనివాడునై యుండి దేవుని కుమారుని పోలియున్నాడు" (హెబ్రీ 7:3). దేవుడే మెల్కీసెదెకు రూపమును దాల్చి అబ్రాహామునకు పరమాహారమును తెచ్చెనని ఇది నిరూపించుచున్నది. ఇది యేసుక్రీస్తు ప్రభువు తన శరీరమును

అర్పించి, తన రక్తమును చిందించనై యున్నాడను ప్రవచనమై యున్నది. ఆ పరమాహారమును భుజించుట ద్వారా సొదొమరాజు తెచ్చిన శోధనను జయించుటకు కావలసిన అధిక బలమును పొందెను. మనము ఆత్మీయబలమును పొందుటకు పరమాహారము కావలెను. మనము బాల్యమందును, యౌవన దశలోను, వృద్ధాప్యములోను ఎదుర్కొనవలసిన ప్రతి శోధనను జయించగలుగుటకు తగిన యేర్పాటు ప్రభువు చేసెను. "సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు; మీరు సహింపగలిగి నంతకంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు. అంతేకాదు, సహింపగలుగుటకు ఆయన శోధనతో కూడ తప్పించుకొను మార్గమును కలుగజేయును" (1 కొరింథీ10:13). మెల్కీసెదెకు చేతినుండి పరమాహారము పొందుట వలననే ఆ విజయము సాధ్యమైనది. మన బైబిలు జ్ఞానము, మనోబలము, శోధన సమయములో మనకు సహాయము చేయజాలవు. యేసుక్రీస్తు ప్రభువు మన కరుణగల నమ్మకమైన ప్రధాన యాజకుడు. హెబ్రీ7:3 ప్రకారము విశ్వాసముతో మన మాయన యొద్దకు వెళ్లి మెల్కీసెదెకు క్రమము చొప్పున గొప్ప ప్రధాన యాజకుడుగా ఆయన చేయుచున్న పరిచర్య ద్వారా శత్రువు యొక్క సమస్త తంత్రములపై జయము పొందెదము. ఆయనే మనకు జయము ననుగ్రహించును. తమ బైబిలు జ్ఞానము, ఉపవాసములు, దీర్ఘ ప్రార్థనలపై గాని లేక

తమ శక్తిమీదనే ఆధారపడువారు ఆత్మీయముగా ఓడిపోయిన వారుగాను, ఫలము లేనివారుగాను ఉందురు. అయితే యేసుక్రీస్తు ప్రభువు యొక్క ప్రధాన యాజక పరిచర్యద్వారా మేలు పొంద నేర్చుకొనిన వారు అనుదినము ఆత్మీయముగా బలవంతులగు చుందురు.

మొదట యేసుక్రీస్తు ప్రభువును మన రక్షకునిగా ఎరుగు చున్నాము. తరువాత ఆయనను మన ప్రభువుగాను, రాజుగాను ఎరుగుచున్నాము. ఆ తరువాత ఆయనను మన గొప్ప ప్రధాన యాజకుడుగా తెలిసికొనుచున్నాము. మన అనుదిన జీవితమునకు ఆయన ప్రధాన యాజక పరిచర్య అన్వయించుకొనుటకు ప్రభువు మనకు నేర్పించునుగాక!

## ఆరవ అధ్యాయము

# నిశ్చలమైన లంగరు

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక ఆరవ అధ్యాయములో యేసు క్రీస్తు ప్రభువు మన రక్షణకు లంగరు అని అపొస్తలుడు వ్రాయుచున్నాడు. "ఈ నిరీక్షణ నిశ్చలమును, స్థిరమునై, మన ఆత్మకు లంగరువలె నుండి తెరలోపల ప్రవేశించుచున్నది" (హెబ్రీ 6:19). పౌలును అతని తోడి ప్రయాణికులును రోమాకు పోవుదారిలో నున్నప్పుడు సముద్రములో బహుతీవ్రమైన తుఫానును ఎదుర్కొనిరి (అపొ.కా. 27:28, 29). దాగియున్న రాళ్లను ఢీకొను ప్రమాదములో నుండిరి. ఓడను స్థిరముగా నుంచుటకు అమరములో నుండి నాలుగు లంగరులు వేసిరి. మనము కూడ అనేక తుఫానులు, శోధనలను మన జీవితములో ఎదుర్కొనవలసి యుండును. కొన్ని పర్యాయములు వెలుపల నుండి, లోపలనుండి శత్రువు మిక్కిలి తీవ్రముగా ఎదుర్కొనును. అట్టి పరిస్థితులలో యేసుక్రీస్తు ప్రభువే మనకు నిజమైన లంగరు. ఆయన ఎన్నడు మనలను విడువడు ఎడబాయడు. మనము విశ్వాసముతో ఈలాగున పలుకవలెను. "ప్రభువా నీవే నాకు లంగరు." అతి కష్టతరమైన పరిస్థితులలో మన నిజలంగరైన యేసు క్రీస్తు ప్రభువునే చేపట్టవలెను.

హెబ్రీ 6:14లో ప్రభువు ఈలాగనెను. "నిశ్చయముగా నేను నిన్ను ఆశీర్వదింతును. నిశ్చయముగా నిన్ను విస్తరింపజేతును."

మెలితేలో సువార్త ప్రకటింపచేయుటకు పౌలును ప్రభువు తుఫాను ద్వారా తీసికొనివెళ్లెను. మెలితేలో నున్న ప్రజలు సువార్తను వినియుండలేదు. పౌలు బోధ విని అక్కడ అనేకులు తిరిగి జన్మించిరి. వారు రోమాకు బయలుదేరిపోవుచున్నప్పుడు పౌలుకును, అతనితో నున్నవారికిని కావలసిన వస్తువులు సమృద్ధిగా యిచ్చిరి. అలాగున దేవుడు మన జీవితములో వచ్చు తుఫానులను వాడుకొని మనలను అధికమైన, విస్తరింపచేయు ఆశీర్వాదములలోనికి నడిపించుట చూడగలము.

అనేకులు వారి పాపములకు క్షమాపణ పొందుటతోను, పరలోకములో ఏదో నొకమూల దొరుకునను నిరీక్షణతోను తృప్తిపడి యుందురు. అయితే మనము సంపూర్ణతకు సాగిపోవలెనని ప్రభువు కోరుచున్నాడు. ఆత్మీయముగా శిశువులను పోలియుండక, పరిపూర్ణతకు సాగిపోవలెనను ఆశకలిగి యుండవలెను. గత అనుభవములు ఎంత అద్భుతమైనవైనను మనము వాటిలో అతిశయించకూడదు. దేవుని వాక్యమును సంపూర్ణముగా నమ్మి, ఆయన బలముతో, జ్ఞానముతో ఆయన కోరు అంతస్తును అందుకొనవలెను.

## ఏడవ అధ్యాయము

# దేవుని గొప్ప కోరిక

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక ఏడవ అధ్యాయములో యేసుక్రీస్తు ప్రభువుయొక్క విజ్ఞాపన పరిచర్య ద్వారా ఆయన పరిపూర్ణత లోనికి మనలను నడిపించవలెనని పరిపూర్ణుడైన దేవుడు గొప్ప కోరిక కలిగియున్నట్లుగా చూచుచున్నాము. యేసుక్రీస్తు ప్రభువు మన శాశ్వతమైన నమ్మకమైన ప్రధాన యాజకుడు (హెబ్రీ 7:11, 25).

మన శ్రమలు, శోధనలను స్వంత శక్తితో జయించుటకు మనమందరము ప్రయత్నించుచుందుము. అప్పుడు మనమెంతటి బలహీనులమో, శక్తిహీనులమో గుర్తించెదము. శ్రమలు, శోధనలను జయించుటకు యేసుక్రీస్తు ప్రభువు మన పక్షముగా చేయుచున్న విజ్ఞాపన పరిచర్యను అన్వయించుకొనవలెను. ఆయన మన మార్పులేని నిత్యమైన ప్రధాన యాజకుడు. ఇదియుగాక "యాజకులు మార్చబడిన యెడల అవశ్యముగా యాజక ధర్మము సహా మార్చబడును" (హెబ్రీ 7:12). దీని భావమేమనగా మన బలహీనతలు, శ్రమలు, పతనములను ఎరిగియుండి ఎడతెగక మన పక్షముగా ఆయన విజ్ఞాపన చేయుచున్నాడు. అయితే విశ్వాసముతో ఆయన పరిచర్యను మనకు అన్వయించుకొనని యెడల దానివలన మనకెట్టి లాభమును కలుగదు. ఉదాహరణకు, యేసుక్రీస్తు ప్రభువు

సిలువలో మరణించెను అని చెప్పినంత మాత్రమున మనము రక్షణ పొందజాలము. మనము విశ్వాసముతో ఆయన నాకొరకు సహితము సిలువలో మరణించెను. ఆయన నా స్థానమును వహించెను. ఆయన నా శిక్షను, తీర్పును భరించెను అని పలికినప్పుడు ఆయన బల్యర్పణ మన జీవితములలో ఫలదాయకమగును. అలాగుననే ఆయన మన శాశ్వతమైన మార్పుచెందని ప్రధాన యాజకుడు, నిరంతరము జీవించుచు మన పక్షముగా విజ్ఞాపన చేయుచున్నాడని నమ్మవలెను. యేసుక్రీస్తు ప్రభువు యొక్క మరణ భూస్థాపన పునరుత్థానములను, మన మరణ భూస్థాపన పునరుత్థానములుగాను ఆయన ప్రధాన యాజక పరిచర్యను కూడ విశ్వాసము ద్వారా అన్వయించుకొనిన యెడల మనకు సహాయము కలుగును. మనము అపవిత్ర పరచబడిన క్షణముననే ఆయనకు మొఱ్ఱపెట్టి విశ్వాసముతో ఆయన విజ్ఞాపన పరిచర్యను అన్వయించుకొన వచ్చును.

మన పక్షమున విజ్ఞాపన చేయుటకు ఎల్లప్పుడు సిద్ధముగా నున్న ఉత్తరవాదియని ఆయనను గురించి 1 యోహాను 2:1, 2లలో చదువుచున్నాము. యిర్మీయా 50:34లో ఈలాగున చదువుచున్నాము. "వారి విమోచకుడు బలవంతుడు, సైన్యముల కధిపతియగు యెహోవా అని ఆయనకు పేరు, భూమికి విశ్రాంతి కలుగజేయుటకును ఆయన బాగుగా వాదించి వారి వ్యాజ్యెమును కడముట్టించును." ఇశ్రాయేలు జనాంగము తమ శత్రువులచే చెరపట్టబడిరి. అయితే దేవుడే దానికి అనుమతించెను. శత్రువులు

వారిని బహుగా హింసించి, వారిని విడుదల చేయ నిరాకరించిరి. కాని దేవుడు వారి విషయములో జోక్యము చేసికొని తన బలమైన హస్తముతో వారిని చెరనుండి విడుదల చేసెను. అలాగుననే మనము ఏదోనొక శోధనలోనో లేక పాపములోనో పడి పోయినప్పుడు అపవాది మనలను విడుదలచేయ నిరాకరించును. తెలివితేటల ద్వారా లేక బైబిలు జ్ఞానము ద్వారా మనము జయించగలము అని తలంచుదుము గాని తప్పిపోవు చుందుము. ప్రభువును ఈలాగున అడుగవలెను. "ప్రభువా ఇది నా బలహీనత, పతనము. దయచేసి నా పక్షముగా విజ్ఞాపన చేసి సాతాను చేతులలో నుండి నన్ను విడిపించుము." ఎడతెగక మన పక్షముగా యేసుక్రీస్తు ప్రభువు యొక్క విజ్ఞాపన పరిచర్యను కోరుకొనుచుండ వలెను. నిరంతరము జీవించుచున్న యేసుక్రీస్తు ప్రభువు మన పక్షముగా విజ్ఞాపన చేసి పతనములనుండి మనలను తప్పించును. ఆయనకు వేరుగా మనము ఏమి చేయలేమని గుర్తించవలెను. తన సంపూర్ణతకు వచ్చునంత వరకు ఆయన విజ్ఞాపన పరిచర్యపై నాధారపడుచుండవలెను. అందు నిమిత్తము ఆయన తన సర్వస్వమును యిచ్చి తన ప్రశస్త రక్తముతో మనలను కొనెను. 1 పేతురు 1:14లో ఈలాగున వ్రాయబడి యున్నది. 'నేను పరిశుద్ధుడనై యున్నాను గనుక మీరును పరిశుద్ధులై యుండుడి." కావున ఆయన పరిపూర్ణతకు తేబడుటకు ఆయన విజ్ఞాపన పరిచర్య మనకు అవసరమై యున్నది.

పాత నిబంధన కాలములో వేలకొలది బలులను యాజకులు అర్పించుచుండెడివారు. అయితే వారి సేవా పరిచర్యల ద్వారా ఎవరును పరిపూర్ణతను పొందలేదు (హెబ్రీ 7:19). అవియన్నియు యేసుక్రీస్తు ప్రభువు యొక్క పరిపూర్ణమైన బల్యర్పణకు ఛాయగా ఉన్నవి (హెబ్రీ 8:5). సర్వోన్నతుడగు దేవుని యాజకుడుగా మెల్కీసెదెకు అబ్రాహామునకు ప్రత్యక్షమై శోధన సమయములో బలపరచుటకు పరమాహారమును అతనికి తెచ్చెను. అయినను అబ్రాహాము పరిపూర్ణత పొందుటకు అతడు సహాయము చేయలేకపోయెను. విరుగగొట్టబడుటకు తన శరీరమంతటిని అప్పగించి మన పక్షముగా మరణమును జయించి యేసుక్రీస్తు ప్రభువు ఇప్పుడు మనకు పరలోకపు ప్రధాన యాజకుడాయెను. ఆయన ద్వారా మనము పరిపూర్ణతను అందుకొనగలము (హెబ్రీ 7:24, 25). ఆయన పరిపూర్ణమైన ఆ ఒక్క బల్యర్పణతో తన స్వంత పరిపూర్ణత ద్వారా మనలను కూడ పరిపూర్ణులనుగా చేయుచున్నాడు. మనము పడిపోయినప్పుడెల్లను సమస్త దీనత్వముతో, విరిగి నలిగిన స్వభావముతో ఆయన యొద్దకు వెళ్లవచ్చును. తన ప్రధాన యాజకపు పరిచర్యతో ఆయన మనలను లేవనెత్తును. మనము పాపము చేయుచు నుండవచ్చునని దీని భావము కాదు. అయితే మన మానవ హద్దుబాటును గుర్తించి ఆయన పరిచర్యపై నాధారపడవలెను.

ఆయన విజ్ఞాపన పరిచర్యను అన్వయించుకొనుటకు ప్రభువు మనకు నేర్పించి, పరిపూర్ణతకు మనలను నడిపించును గాక!

## ఎనిమిదవ అధ్యాయము

# గొప్ప ప్రత్యక్ష గుడారము

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక ఎనిమిదవ అధ్యాయములో యేసుక్రీస్తు ప్రభువు పరలోకపు ప్రత్యక్ష గుడారము యొక్క ప్రధాన యాజకుడు అని చదువుచున్నాము. భూ సంబంధమైన ప్రత్యక్ష గుడారమును మోషే స్థాపించెను. పరలోకపు ప్రత్యక్ష గుడారమును యేసుక్రీస్తు ప్రభువు స్వయముగా స్థాపించెను. "ఆయన పరిశుద్ధాలయమునకు, అనగా మనుష్యుడు కాక ప్రభువే స్థాపించిన నిజమైన గుడారమునకు పరిచారకుడైయుండి, పరలోకమందు మహామహుని సింహాసనమునకు కుడిపార్శ్వమున ఆసీనుడాయెను" (2వ వచనము). పాత నిబంధన కాలములో యిష్టపూర్వకముగా బంగారము, తుమ్మకఱ్ఱ, ఇత్తడి, ఇనుము మొదలగునవి అర్పించి వారు ప్రత్యక్ష గుడారపు నిర్మాణములో పాలుపొందిన రీతిగా ఇప్పుడు మనము కూడ యేసుక్రీస్తు ప్రభువు నందలి విశ్వాసులముగా పరలోకపు ప్రత్యక్ష గుడారములో నొక భాగము కాగల ఆధిక్యతను ప్రతి యొక్కరము కలిగియున్నాము. మోషే భూ సంబంధమైన సామగ్రితో ప్రత్యక్ష గుడారమును నిర్మించెను. అందువలననే అది ఎక్కువ కాలము నిలిచి యుండలేదు. ఇప్పుడు మన ప్రభువు శాశ్వతమైన ప్రత్యక్ష గుడారమును నిర్మించుచున్నందున, అందులో మనమెల్లరమును పాలుపొందవచ్చును. మనము కలిగియున్నదానిలో కొంచెము

అర్పించుటలేదు గాని మన సమస్తమును అర్పించుచున్నాము. మనమందరమును యేసుక్రీస్తు ప్రభువుయొక్క శిరసత్వము క్రింద పరలోకపు ఏర్పాటు చొప్పున ఒక పరిశుద్ధ స్థలముగా కట్టబడుచున్నాము. హెబ్రీ 8:5లో మనము చదువుచున్న రీతిగా ఇంతకు మునుపు ఉండిన గుడారము, మోషేకు దేవుడు సూచించిన ప్రకారము, నిజమైన పరలోకపు ప్రత్యక్ష గుడారము నకు ఛాయగా నున్నది.

ప్రత్యక్ష గుడారపు నమూనాను ఇచ్చుటకు పూర్వము నలువది పగళ్లు, నలువది రాత్రులు దేవుడు సీనాయి పర్వతము మీద మోషేను ఉంచినట్లు చూచియుంటిమి. దానికి మునుపు నలుబది సంవత్సరములు అతడు అరణ్యములో నుంచబడెను. ఆ కాలములో అతని జ్ఞానము సంపూర్ణముగా యినుమంతైనను లేకుండ ఖాళీ చేయబడెను. అప్పుడు దేవుడు అతనికి ఆ నమూనాను ఇచ్చెను. అందులో ఎట్టి మార్పులు చేయక, ఆయన సూచనల ప్రకారము అతడు నెరవేర్చెను. ఆ సంపూర్ణ నమూనాను దేవుడే  ఇచ్చియుండినను, అది కేవలము ఛాయ మాత్రమే. ఇప్పుడు యేసుక్రీస్తు ప్రభువు నిజమైన ప్రత్యక్ష గుడారమును చేతి సహాయముతో గాక మన సహకారముతో నిర్మించుచున్నాడు. అందువలననే విశ్వాసులు, దేవుని కట్టడము, దేవుని నివాస స్థలము, దేవుని మందిరము, దేవుని జతపనివారు, దేవుని స్వకీయ సంపాద్యము, విలువైన ముత్యము, ఆయన పెండ్లికుమార్తె మొదలగు వివిధ పేర్లతో పిలువబడుచున్నారు. ఆ పేర్లన్నియును

మన పరలోకపు పిలుపును బయలుపరచుచున్నవి. మన పరలోకపు నమూనాను ఎవరును మార్చజాలరని ఇచ్చట ప్రభువు మనకు జ్ఞాపకము చేయుచుండెను.

ఆయన ఏర్పాటులో అమర్చబడుటకు ఎడతెగక మనము యేసుక్రీస్తు ప్రభువుయొక్క శిరసత్వము క్రిందను, ప్రభుత్వము క్రిందను ఉండవలెను. యేసుక్రీస్తు ప్రభువు క్రొత్త నిబంధనకు కర్తగా తన క్రొత్త నిబంధన ద్వారా దైవ నియమములను మన హృదయములమీద వ్రాయుచుండెను (హెబ్రీ 8:8-11). పాత నిబంధన ద్వారా మానవులెల్లరు శిక్షావిధిలోనికి తేబడిరి. వారు సంపూర్ణముగా చెడిపోయిన స్థితి వారికి తెలియజేయబడును. యేసుక్రీస్తు ప్రభువు క్రొత్త నిబంధనకు కర్తగా సమస్త శోధనలను జయించెను. ఆజ్ఞలన్నింటిని నెరవేర్చెను. పునరుత్థాన శక్తిద్వారా ఆయనే మన నీతి అయెను. అదే శక్తిద్వారా తన న్యాయ విధులను మన హృదయముల మీద వ్రాయుచుండెను. పరిశుద్ధాత్మ ద్వారా అతి బలహీనుడైన విశ్వాసి సహితము ప్రభువును వెంబడించ గలడు. గలతీయులకు వ్రాసిన పత్రిక ఐదవ అధ్యాయములో అపొస్తలుడైన పౌలు ఆత్మ నింపుదల కలిగిన జీవితమును గురించి మూడు పదములను ఉపయోగించెను. ఆత్మానుసారముగా నడచుకొనుట (16వ వచనము), ఆత్మ చేత నడిపింపబడుట (18వ వచనము), ఆత్మను అనుసరించి జీవించుట (25వ వచనము). మనము నడచునప్పుడు, అడుగు వెంబడి అడుగు వేయుదుము, కాని గంతులు వేయము. సామెతలు 3:6 ప్రకారము మన ప్రవర్తన

అంతటియందు ఆయన అధికారమునకు లేక ప్రభుత్వమునకు ఒప్పుకొనవలెను. దాని భావమేమనగా, మన ప్రతి అడుగునకు ఆయన సహాయమును కోరవలెను. కీర్తనలు 37:23 ప్రకారము మన నడక ఆయన ద్వారా స్థిరపరచబడుచున్నది. పరిశుద్ధాత్మమనలను ఏలుచు మనలను నడిపించును, అలాగున పరిశుద్ధాత్మలో మనము జీవించగలము.

తిరిగి జన్మించనివారు ఎంత బైబిలు జ్ఞానమును కలిగి యున్నను, దేవుని వాక్యములోని మర్మములను గ్రహించలేరు. మన పాపములు క్షమించబడి, మనము తిరిగి జన్మించిన క్షణముననే, దైవ స్వభావములో పాలివారమగుదుము. విశ్వాసము ద్వారా యేసుక్రీస్తు ప్రభువును మన హృదయములో చేర్చుకొని నప్పుడు దైవ స్వభావము మనలో రూపింపబడుచున్నది. చాలినంత సమయము మోకాళ్లపై మనము గడిపిన యెడల దైవ సాన్నిధ్యమును అనుభవించగలము. ఆయన సన్నిధిలో నున్నప్పుడు, దినమంతటి కొరకు మనలను సిద్ధము చేసి, నడిపింపును దయచేసి పాటించవలసిన సూచనల ననుగ్రహించుమని ప్రభువును మనము వేడుకొనవచ్చును. మన మార్గములను ప్రభువునకు అప్ప గించుకొని, ఆత్మీయముగాను, శారీరకముగాను, అక్కరలో నున్నవారి యొద్దకు మనలను నడిపించి, వారి అక్కరను తీర్చుటకు మనకు సహాయపడునట్లుగా ఆయనను వేడుకొన వలెను. దినమంతటి కొరకు తన ఏర్పాటును కనుపరచి, శోధన, పరీక్షా సమయముల కొరకు సిద్ధము చేయుమని ప్రభువును

ప్రార్థించవలెను. ఉదాహరణకు, మనము యెవరినైన సంప్రదించుటకు గాని లేక ఒక ముక్కోపము కలిగిన వ్యక్తి యొద్దకు వెళ్లినప్పుడు గాని మారుమాట పలుకకుండ వారి మాటలు లేక విమర్శను సహించగలుగుటకు కావలసిన అధికమైన కృపను ప్రసాదించుమని ప్రభువును వేడుకొనవలెను. కొందరు గయ్యాళి అత్తలను కలిగియుందురు. అట్టివారితో నుండుట చాలా కష్టము. ఎందుకనగా ఉద్దేశపూర్వకముగా తమ కోడళ్లలో ఏదో నాక తప్పు పట్టవలెనని అట్టివారు కాచుకొని యుందురు. ఆ కోడలు కొన్ని దినములు ఆమె తిట్లను సహించును. ఆ తరువాత ఆమె అత్త ఒక్కమాట అనిన యెడల ఏడు మాటలు వడ్డించుటకు మొదలు పెట్టును. అయితే అట్టి ధోరణి సమస్యను పరిష్కరించలేదు. క్రమముగా అట్టి పరిస్థితులు దుఃఖకరమైన గృహమునకు దారితీయును.

ప్రతి పరిస్థితిని అనుకూలపరచి ఆయన నామమునకు దూషణ కలుగజేయకుండా మనలను కాపాడునట్లును, నిర్దయగల మాటలన్నిటికి బదులు చెప్పకుండ ఓపికతో భరించగలుగుటకును కృపననుగ్రహించు మనియును ప్రభువును ప్రార్థించవలెను. అలాగుననే ఆఫీసులో గాని లేక ఇతర స్థలములలో కలుగు ఎట్టి పరిస్థితికైనను ఆయన కృపను కోరుకొనగలము. ప్రభువు మనయొక్క జాలిగల ప్రధాన యాజకుడుగా నున్నందున సమస్త పరిస్థితులలోను మన బలహీనతలయందు సహాయము చేయును. మన హృదయములపై ఆయన తన ధర్మ విధులను వ్రాసి ప్రతి పరిస్థితికి సరియైన మాటల ననుగ్రహించును.

యేసుక్రీస్తు ముఖ్య ఇంజనీరుగా పరలోక నివాసస్థలము

యొక్క ఏర్పాటును ఎరిగియున్నాడు. ఒకే పర్యాయము ఆ ఏర్పాటును సంపూర్ణముగా మనకు కనబరచదు. అనుదినము ఆయన **యొద్దనుండి మనము సూచనలు పొందవ**లెను. అది అనుదిన అభ్యాసమై య**ున్నది. అయి**తే అనేక **పర్యా**యములు అనుదిన పరిచర్య, పనిపాట్ల కొరకు దేవుని సహాయమును జ్ఞానమును, నడిపింపును కోరుకొను విషయములో తప్పిపోవు చున్నాము. దేవుని పరిపూర్ణమైన ఏర్పాటులోనున్నప్పుడు దేవుని నిజమైన శాంతిని అనుభవించగలము. అందువలననే సొలొమోనుకాలములో దేవుని ఆలయము కట్టబడుచున్నప్పుడు సుత్తె లేక గొడ్డలి మొదలగు పనిముట్లు వాడబడలేదు(1రాజులు 6:7). దేవుని ఆలయము అతని కుమారుడైన సొలొమోను కట్టునని దేవుడు దావీదుతో చెప్పెను. 1 దిన వృత్తాంతములు 28:19లో ఆ పని ఏర్పాటు నంతయు దేవుడు దావీదునకు వ్రాతమూలకముగా నేర్పినట్లు చదువు చున్నాము. ఆ ఏర్పాటునే ప్రతి విషయములోను పనివారు పాటించవలసి యుండెను. ఆలయ నిర్మాణములో చక్కగా మలచబడిన పెద్ద పెద్ద రాళ్లను ఉపయోగించిరి. ఆలయ నిర్మాణ స్థలములో ఎట్టి పనిముట్లు లేక సుత్తె యొక్క అవసరత లేకపోయెను. ఎందుకనగా అవి ముందుగానే సరియైన కొలతకు మలచబడి చక్కగా రూపొందించబడినవి. అలాగున పని నిశ్శబ్దముగా కొనసాగిపోయెను. ఇది శాంతిని, సమాధానమును సూచించుచున్నది. దేవుని ఏర్పాటులో నున్నప్పుడు మనలో పరలోక శాంతి సమాధానములు పెంపొందుచుండును.

## తొమ్మిదవ అధ్యాయము

# గొప్ప స్వాస్థ్యమునకు సిద్ధపాటు

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక తొమ్మిదవ అధ్యాయములో గొప్ప రక్షణ యొక్క మరియొక లక్షణమును చూడగలము. నిత్య స్వాస్థ్యములో మన భాగము నిమిత్తము మనమేలాగు సిద్ధపరచబడుచున్నామో ఇందు చూడగలము. కొన్ని పర్యాయములు ఒక భాగ్యవంతుడైన తండ్రి తన మరణమునకు తరువాత తన పిల్లలు ఆస్తిలో పొందవలసిన భాగములను తన వీలునామాలో వ్రాసిపెట్టును. అతడు మరణించిన తరువాతనే ఆ వీలునామా అమలులోనికి వచ్చును, తన తండ్రి వీలునామా ప్రకారముగా ఆ పిల్లలు ఆస్థిలో భాగములు పంచుకొందురు. యేసుక్రీస్తు ప్రభువు పాత నిబంధనను సమాప్తము జేసెను. ఇప్పుడు ఆయన క్రొత్త నిబంధనకు మధ్యవర్తియై యుండెను. మనము జయించగల సామర్థ్యము ననుసరించి ఆయన ద్వారా స్వాస్థ్యములో మన భాగమును పొందబోవు చున్నాము (ప్రకటన 21:7). మన పాపములు యేసుక్రీస్తు ప్రభువు యొక్క కృపద్వారా ఉచితముగా క్షమింపబడినవి. అయితే పరలోక స్వాస్థ్యమును, మన భాగమును మనము జయించినప్పుడు మాత్రమే పొందగలము. జయించుటకు అనేక కష్టములు ఎదురగుట చూడగలము. ఎట్లు జయించ గలమో నేర్పించుటకు యేసుక్రీస్తు ప్రభువు మనకు మధ్యవర్తియాయెను. ఆయన మన విజ్ఞాపన

కర్తయని 7వ అధ్యాయములో చూచితిమి. ఆ విజ్ఞాపన ద్వారానే పరలోక స్వాస్థ్యము కొరకు మనలను ఇప్పుడు సిద్ధపరచుచుండెను.

పాత నిబంధన కాలములో ప్రజలు, వారి అక్కర ననుసరించి పాప క్షమాపణ నిమిత్తము అనేక బలుల నర్పించుచుండెడివారు. అయితే ఆ బలులు వారికి మంచి మనస్సాక్షిని ఇవ్వలేకపోయెను. పాపపు తలంపులు, మాటలు, క్రియల ద్వారా కలిగిన మరకలను బట్టి దోషపూరితమగు మనస్సాక్షిని శుద్ధీకరించుటకు ఎడతెగక ఆయన అమూల్య రక్తమును కోరుకొనవలెనని ఇచ్చట యేసుక్రీస్తు ప్రభువు చూపించెను. అది దేవుని సన్నిధిలోనికి మనకు ధైర్యమను గ్రహించి నిత్యస్వాస్థ్యములో భాగము పొందుటకు మనలను సిద్ధము చేయును. ఆ రక్తము ఇప్పుడు అతి పరిశుద్ధస్థలము, పరలోకములో నున్నది. మనము తలంపుద్వారా గాని, మాట ద్వారా గాని , క్రియద్వారా గాని అపవిత్రులమైన క్షణముననే శుద్ధీకరణ కొరకు ఆయన ప్రశస్త రక్తమును కోరుకొనవలెను. మన ప్రధాన యాజకుడుగా మన ప్రభువు పరమందున్నాడు. శుద్ధీకరించ బడిన పిదప మంచి మనస్సాక్షిని కలిగిన వారముగా ధైర్యముతో ఆయనకు మొఱ్ఱపెట్టగలిగెదము. మనకు దోషభరితమైన మనస్సాక్షి ఉన్న యెడల ఆయన వైపు చూచుటకు భయపడెదము. మంచి మనస్సాక్షిని కలిగి ఉన్నప్పుడు ఆయనను ఎంతో సంతోషముతో చూడగలము. ఆయనను ఆహ్వానించగలము. ప్రశస్త రక్తము ద్వారా ఆయన మనలను శుద్ధీకరించి ఆయన రాక కొరకును, మన పరలోక స్వాస్థ్యము కొరకును మనలను సిద్ధము చేయును.

పాత నిబంధన కాలములో నున్న ప్రత్యక్ష గుడారములో మూడు భాగములు కలవు (హెబ్రీ 9:2-5). మొదటిది, వెలుపలి ఆవరణము. ఆ ఆవరణములో బలులర్పించుటకు బలి పీఠమును, కాళ్లు కడుగు కొనుటకు గంగాళమును ఉండెను. రెండవది, యాజకులు పరిచర్య చేయు పరిశుద్ధ స్థలము. మూడవది. దేవుని మందస ముంచబడిన అతి పరిశుద్ధ స్థలము. తెరవెనుక అతి పరిశుద్ధ స్థలములో దేవుని మందసము మీద కరుణా పీఠము కలదు. యాజకులు అచ్చోటకు వెళ్లుటకు అనుమతి లేదు. వెలుపలి ఆవరణములో సూర్యుని కాంతి ప్రకాశించుచుండెను గాని అతి పరిశుద్ధ స్థలములో దేవుని వెలుగు ప్రకాశించుచుండెను. పరిశుద్ధ స్థలములో ద్వారము గాని లేక కిటికీ గాని లేదు. అయితే దాని నిమిత్తము అచ్చట పెట్టబడిన బంగారు దీపస్తంభములో ఉన్న దీపము నిరంతరము వెలుగు చుండెను. తెర లోపలికి సంవత్సరమునకొక పర్యాయము కేవలము ప్రధాన యాజకుడు మాత్రము బలి రక్తముతో వెళ్లుచుండెను. ఇతరులెవరును అక్కడకు వెళ్లకూడదు. యేసుక్రీస్తు ప్రభువు యొక్క ప్రశస్త రక్తములో నున్న శక్తి ద్వారానే దేవుని పరిశుద్ధ సాన్నిధ్యమును అనుభవించగలమని దేవుడు ఇచ్చట తెలియజేయుచుండెను. మనము తలంపు, మాటలు, క్రియలతో చేయు ప్రతి పాపము మనస్సాక్షిపైనొక మరకను వేయును, గనుక మన పాపములన్నింటినుండి మనము క్షమించబడి, కడుగబడి, శుద్ధీకరించబడవలెను.

ప్రతి మానవునిలో శరీరము, ప్రాణము, ఆత్మయను మూడు భాగములు కలవు. రక్తము, కండరము, ఎముకలు శరీరమందున్నవి. ప్రాణము (లేక జీవము) నందు వివేకము, ఉద్రేకము, మనోబలము కలవు. ఆత్మయందును మూడు భాగములు కలవు - అవేవనగా, మొదటిది మనస్సాక్షి లేక అంతరంగిక స్వరము లేక మంచి చెడులను లేక తప్పు ఒప్పులను వివేచించు జ్ఞానము. రెండవది, అదృశ్యమైన దానిని ఎరుగ వలెనను కోరిక మనలో నున్నది. మన సృష్టికర్తను, ఆయన యెక్కడ నున్నాడో, ఏలాగున ఆయనను కనుగొనగలమో ఎరుగవలెనను కుతూహలమును కలిగి యున్నాము. మూడవది, అంతరంగిక జ్ఞానము. దీని వలననే ఏదో ఒక కార్యమును చేయవలెనను తలంపు అకస్మాత్తుగా కలుగును. ఆదికాండము 1:27లో ఈలాగున చదువుచున్నాము. "దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను." మొదట మానవుని ముఖములో దేవుని మహిమా సౌందర్యములు కనబడినవి. పాపమునుబట్టి మానవుడు మూడంతల క్షీణత నొందెను. పాపము వలన ఆత్మ చనిపోయెను. జీవము చీకటిమయమాయెను, శరీరము అపవిత్రమాయెను. యోహాను 4:24లో "దేవుడు ఆత్మయై యున్నాడు" అని చదువుచున్నాము. దేవుడు ఆత్మయై యుండి జీవించుచున్నాడు. ఆయనను మనము స్పృశించగలము. ఆయనతో మాట్లాడి, ఆయనను ఎరుగగలము. అయితే మన భౌతిక నేత్రములతో ఆయనను చూడలేము. మన ఆత్మయందు ఆయనను స్పృశించి

ఆయనతో మాటలాడగలము. ఆయన పరిశుద్ధుడైన దేవుడు గనుక పాపములో జీవించినంత కాలము, క్షమాపణ పొందని స్థితిలో నున్నంత పర్యంతము దేవుని సాన్నిధ్యమును అనుభవించలేము. ఆయన స్వరమును వినలేము. హెబ్రీ 12:14లో దేవుని వాక్యము ఈలాగున సెలవిచ్చుచున్నది. "పరిశుద్ధత లేకుండ ఎవడును ప్రభువును చూడడు" మత్తయి 5:8లో ఈలాగున చదువు చున్నాము. "హృదయ శుద్ధి గలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు." పరిశుద్ధులముగా నుండిన యెడల దేవుని చూడగలము. మన దేవుడు పరిశుద్ధుడని 1 పేతురు 1:14లో వ్రాయబడి యున్నది. అట్టి పరిశుద్ధతను తమంతట తామే ఎవరును పొందజాలరు. శాశ్వతమైన పరిశుద్ధతను మనము కలిగియుండవలెనని దేవుడు కోరుచున్నాడు.

మత్తయి 5:48లో మన ప్రభువు ఈలాగనెను, "మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండెదరు." స్వంత ప్రయత్నము ద్వారా మనమెవరమును దేవుని పరిపూర్ణతను గాని లేక పరిశుద్ధతను గాని పొందలేము. మనలను పరిశుద్ధులనుగా చేయు నిమిత్తమే ప్రభువు మరణము నుండి తిరిగి లేచెను. పాత నిబంధన కాలములో వారు పరిశుద్ధముగా ఉండవలసిన విధానమును ప్రత్యక్ష గుడారము ద్వారా దేవుడు తన ప్రజలకు కనుపరచెను. ఉదాహరణకు, అతి పరిశుద్ధ స్థలములో దైవ వెలుగు ఉండెను. అదే దైవ వెలుగుతో మనము నింపబడవలెనని దేవుడు కోరుచుండెను. కేవలము దైవ వెలుగులో మాత్రము మన

నిజస్థితిని చూడగలము. సాధారణ పరీక్షలద్వారా నిర్ణయించబడని, కనబడని కొన్ని వ్యాధులు గలవు. కొన్ని సంవత్సరముల క్రితము ఎక్స్‌రేలు కనుగొనబడినవి; ఇవి శరీరము యొక్క లోపలిభాగముల నిజస్థితిని స్పష్టముగా చూపించగలవు. ఎక్స్‌రేల ద్వారా ఎముకలలో పగుళ్ళున్నవేమో చూడవచ్చును. అదే రీతిగా దేవుని వెలుగు మనలోనికి వచ్చినప్పుడు, దేవుడు మనలను చూచుచున్న విధముగా మనలను మనము చూచుకొనుటకును, దేవుని మహిమా సౌందర్యములను చూడగలుగుటకును, మనకు సహాయపడును.

ప్రత్యక్ష గుడారమునందు కేవలము ప్రధాన యాజకుడు మాత్రమే సంవత్సరమునకొక పర్యాయము తెరలోపలికి వెళ్లగలిగెను. అతడు సహితము బలి రక్తముతో ప్రవేశింపగలిగెను. మహిమాలంకార వస్త్రములు లేక ప్రతిష్ఠిత వస్త్రములను పేరు గలిగిన వస్త్రముల నితడు ధరించుచుండెడివాడు. నిర్గమ కాండము 28వ అధ్యాయములో ప్రతిష్ఠిత వస్త్రములను గురించి చదువుచున్నాము. మొదటిది, చొక్కాయిని అతడు ధరించును. దానిపైన నిలువుటంగీని ధరించును. నిలువుటంగీ అంచు చుట్టు నీల ధూమ్ర రక్తవర్ణములు గల దానిమ్మ పండ్లును, వాటి నడుమను బంగారు గంటలును కలవు. బంగారుతోను నీలధూమ్ర రక్త వర్ణములు గల పేనిన సన్న నారతో చిత్రకారుని పనిచేయబడిన ఏఫోదును నిలువుటంగీపైన అతడు ధరించును. పైభాగములో పండ్రెండు రత్నములను, అడుగు భాగములో ఊరీము,

తుమ్మీములను కలిగియున్న న్యాయవిధాన పతకమును ఏఫోదు మీద అతడు ధరించును. ఈ వస్త్రములన్నియును దైవత్వమును సూచించుచున్నవి. ప్రధాన యాజకుడు అతి పరిశుద్ధ స్థలము లోనికి వెళ్లక మునుపు ప్రతిష్ఠిత వస్త్రములను తీసివేసి, వాటికి బదులు తెల్ల వస్త్రములను అతడు ధరించవలసి యుండెను. దీని భావ మేమనగా, ప్రజల పక్షముగా బలిపశువు యొక్క రక్తము దేవుని సన్నిధికి తీసికొని వెళ్లక మునుపు అతడు సామాన్యమైన మనుష్యుడు కావలసి యుండెను. అందువలననే యేసుక్రీస్తు ప్రభువు దేవుని దూతను బోలి ఈ లోకములోనికి రాలేదు, ఆయన మనుష్యుడుగా వచ్చెను (హెబ్రీ 2:16). ఆయన మనవంటి వాడాయెను. ఆయన కోరిన యెడల ఒక దేవుని దూతవలె వచ్చియుండెడివాడు. అయితే దేవుని దూతలు చనిపోలేదు. గనుక మన నిమిత్తము ఆయన మరణ మొందలేక పోయెడివాడు. అందు వలననే దేవుని దూతలు మానవుల బాధలను అర్థము చేసికొనలేరు. కరుణగల నమ్మకమైన ప్రధాన యాజకుడుగాను వుండుట కొరకు యేసుక్రీస్తు ప్రభువు మనవంటి వాడాయెను. తన పక్షముగాను, ప్రజల పక్షముగాను బలిపశువుల రక్తముతో ప్రధాన యాజకుడు అతి పరిశుద్ధ స్థలములోనికి వెళ్ల వలసి యుండెను. ఇది సంవత్సరమునకొక పర్యాయము ప్రాశ్చిత్తార్థ దినమున జరుగుచుండెడిది.

లేవీయ కాండము 23వ అధ్యాయములో రాబోవు సంగతులకు ఛాయలుగా నున్న యేడు యెహోవా పండుగలను

గూర్చి చదువుచున్నాము. పస్కా గొఱ్ఱెపిల్లగా యేసుక్రీస్తు ప్రభువు మరణమును సూచించుచున్న పస్కా పండుగ మొదటిది. రెండవదియగు పులియని రొట్టెల పండుగలో యూదులు పులియని రొట్టెలను ఏడు దినములు భుజించవలెను. పులుపు పాపమునకు సూచనగా నున్నది. ఎందుకనగా పులిసినది కొంచెమైనను పిండినంతటిని పులియజేయును. అదే రీతిగా ఒక పాపపు తలంపు నా దేహమంతటిని అపవిత్ర పరచును. పులియని రొట్టెల వలె మనము ఉండవలెననియు, దైవ స్వభావమును మనకు అనుగ్రహించవలె ననియు ఆయన కోరుచుండెను. పునరుత్థానమును సూచించుచున్న ప్రథమ ఫలముల పండుగ మూడవది. ఒక గింజ చనిపోయినప్పుడు అనేక గింజలు దానిలో నుండి వచ్చునట్లు ప్రభువు మరణము అనేకులను నీతి మంతులుగా చేసెను. సర్వ మానవులు సమానమని సూచించుచున్న పెంతెకొస్తు పండుగ నాల్గవది. పరిశుద్ధాత్మ ద్వారా మనమందరమును ఒకే శరీరములోనికి బాప్తిస్మము పొందితిమి. అయిదవ పండుగైన శృంగధ్వనుల పండుగలో ఏడు దినములు ప్రజలు బూరల నూదవలెను. గొప్ప శక్తితో సర్వలోకమందును సువార్తను ప్రకటించవలసిన ప్రాముఖ్యతను ఇది సూచించు చున్నది. సకల తరగతులకు చెందిన ప్రజలు ఏలాగున నీతి మంతులు కాగలరో సూచించుచున్న ప్రాయశ్చిత్తార్థ దినము ఆరవది. ఏడవదైన పర్ణశాలల పండుగ, ఒక దినమున మనము ఆయనతో ఏలుబడి చేయవలెనని ప్రభువు కోరుచుండెనని సూచించుచున్నది.

ప్రాయశ్చిత్తార్థ దినమున అనేక దూర ప్రాంతములనుండి ప్రజలు సమావేశమైనను ప్రత్యక్ష గుడారములోనికి వెళ్లలేకపోయిరి. వారు వెలుపలనే ఉండవలెను. బలిపశువు తలపై చేతులుంచి తమ పాపములనన్నింటిని వారు ఒప్పుకొనవలెను. ఆ బలిపశువు యేసుక్రీస్తు ప్రభువును సూచించుచున్నది. బలిపశువును వధించిన తరువాత, ప్రధాన యాజకుడు తన ప్రతిష్ఠిత వస్త్రములను తీసివేసి సాధారణ వస్త్రములను ధరించి, బలిపశువు రక్తమును తెరలోపలి భాగమునకు తీసికొనివెళ్లి, దేవుని మందసము పైనున్న కరుణాపీఠము మీద ప్రోక్షించెను. పరిశుద్ధుడైన దేవుని ప్రజల పక్షముగా అర్పించబడిన బలిని అంగీకరించి, వారి పాపముల నన్నింటిని క్షమించెనని సూచించుచు దేవుని అగ్ని దిగివచ్చి రక్తమును దహించివేసెను. అప్పుడు ప్రధాన యాజకుడు, అతి పరిశుద్ధ స్థలములో నుండి, వెలుపలికి వచ్చి తాను వారి పక్షమున తెర వెనుకకు పోయి రక్తమును అర్పించగా ఆకాశము నుండి అగ్ని దిగివచ్చుట చూచెనని ప్రజలకందరికి ప్రకటించెను. దేవుడు వారి పాపములను క్షమించెనని ప్రకటించెను. ఆ దినము జనాంగమంతటికి మహా సంతోషకరమైన దినముగా నుండెను. అవి అన్నియును కేవలము ఛాయగా మాత్రమే నున్నందున ఆ బల్యర్పణలు మానవులను పరిపూర్ణులుగా చేయలేకపోయెను. యేసుక్రీస్తు ప్రభువు యొక్క అర్పణయే పరిపూర్ణమైన బల్యర్పణ. ఆయన తనను తాను అర్పించుకొనుట ద్వారా తనయొద్దకు వచ్చు వారందరిని పరిపూర్ణులనుగా జేయును.

యేసుక్రీస్తు ప్రభువు నొద్ద కేవలము మన పాపములను ఒప్పుకొని, వాటి విషయమై పశ్చాత్తాప పడినంత మాత్రమున నీతిమంతులముగా తీర్చబడుట లేదు. తలంపులోను, మాటలోను, క్రియలోను మనము చేయు ప్రతి పాపము మనస్సాక్షిపైన నొక మరకను కలుగజేయును. మన అర్పణల ద్వారా గాని,లేక పశ్చాత్తాపముతో కూడిన కన్నీళ్ల ద్వారాగాని ఈ మరకలు తుడిచి వేయబడవు. గత పాపములను మన మనస్సాక్షియే ఎల్లప్పుడు మనకు జ్ఞాపకము చేయుచుండును. కష్టపరిస్థితులలో నున్నప్పుడు గతములో మనము చేసిన పాపములను బట్టి దేవుడు మనలను శిక్షించుచుండెనని మన మనస్సాక్షియే నిందించుటకు ఆరంభించును. అనేకులు మనస్సాక్షి ద్వారా గ్రుచ్చబడినవారై దుఃఖించెదరు, ఉపవాసముండెదరు, దాన ధర్మములు చేసెదరు. కొందరు తీర్థయాత్రలు చేసెదరు. ఈలాగున చేయుట ద్వారా వారి మనస్సాక్షిపై నున్న మరకలు మాసిపోవునని తలంచుచుందురు. దోష భరితమైన మనస్సాక్షి వలన వారు కలవరపడుచు సమాధానము లేక యుందురు. అనేకులు వారి పాపములను బట్టి మరణ సమయములో కలవరపడుచు, ఏడ్చుచు, తమకు మనశ్శాంతి కలుగుటకు ఏదో నొకటి చేయుమని ఇతరులను బ్రతిమాలుటకును మొదలు పెట్టెదరు. ఎట్టి మానవ ప్రయత్నమైనను మనస్సాక్షికి నిజమైన శాంతిని చేకూర్చలేదు. హెబ్రీ 9:14 ప్రకారము మన మనస్సాక్షిపై నున్న

దోషపు మరకలు యేసుక్రీస్తు ప్రభువు యొక్క రక్తము ద్వారా మాత్రమే శుద్ధి కాగలవు. ప్రభువే తన స్వరక్తముతో అతి పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను (హెబ్రీ 9:12). కీర్తన 16:10లో నున్న ప్రవచనానుసారముగా యేసుక్రీస్తు ప్రభువు యొక్క శరీరము కుళ్లిపోలేదు. ఆయన పరిపూర్ణముగా పరిశుద్ధుడు. ఆయన పరిశుద్ధాత్మ ద్వారా జన్మించెను. ఇప్పుడు ఆయన రక్తము పరలోకములో నున్నది. దానికి శాశ్వత జీవము కలదు. అచ్చటనుండి మారుమనస్సు పొందుచున్న పాపి హృదయములో, ఆ రక్తము ప్రోక్షింపబడుచున్నది. ఆ రక్తము ద్వారానే మన దోషపు మరకలు కడిగివేయబడుచున్నవి.

నూతన జన్మ పొందక మునుపు మన మనస్సాక్షి పాపముతో అపవిత్రమైనదై యుండెను. మన ఆత్మ చనిపోయి యుండెను. జీవము చీకటితో నిండియుండెను. శరీరము అపవిత్రమై యుండెను. యేసుక్రీస్తు ప్రభువు మన యాజకుడుగా మృతమైన మన ఆత్మలపై రక్తమును ప్రోక్షించినప్పుడు అవి ఉజ్జీవింపబడెను. దైవ జీవము మన ఆత్మల లోనికి ప్రవేశించెను. దేవుని సన్నిధిని గుర్తించుటకు ఆరంభించితిమి. స్నేహితునితో మాట్లాడినట్లుగా దేవునితో మాట్లాడగలము. పరలోకపు శాంతి మనలోనికి వచ్చుట గుర్తించెదము.

మృతమైన మన ఆత్మలు ఉజ్జీవింపబడినప్పుడు ప్రభువు పరిశుద్ధుడై యున్న ప్రకారము మనము కూడ పరిశుద్ధులముగా నుండవలెనను కోరిక కలుగును. దేవుని వాక్యము పట్ల, ఆయన

ప్రజలపట్ల పెంపారు ప్రేమను పొందెదము. చీకటితో నిండిన మన జీవితములు వెలిగింపబడినప్పుడు దేవుని సంగతులు గ్రహించుటకును, ఆయన ఉద్దేశములు ఎరుగుటకును దైవజ్ఞానము మనకు అనుగ్రహింపబడును. దైవ ప్రేమ ద్వారా ప్రజలందరిని సమానముగా ప్రేమించగలము. అపవిత్రమైన మన శరీరము కూడ శుద్ధీకరింపబడును. ఇప్పుడు మన అవయవములతో దేవుని సేవించగోరుచున్నాము. మన నాలుక దేవుని స్తుతించ నారంభించును. మన కాళ్ళు కాని ప్రదేశములకు వెళ్లుటకు నిరాకరించును. శరీరములో ఉన్నంతకాలము ప్రాచీన స్వభావమును బట్టి మనము అపవిత్రులమగుచుందుము. తిరిగి జన్మించినప్పుడు మనము మానవాతీతులమవుట లేదు. ప్రాచీన పురుషుడు లేక ప్రాచీన పాప స్వభావము పలుమార్లు రేపబడుచుండును. ద్వేషము, శత్రుత్వము, గర్వము, లోభత్వము మొదలగు పాపములను మన హృదయములలో ఉండనిచ్చుట ద్వారా పాప స్వభావమును పోషించినవారమై, అపవిత్రుల మవుదుము. అయితే ఎడతెగక యేసుక్రీస్తు ప్రభువు యొక్క ప్రశస్త రక్తమును శుద్ధీకరించుటకు, కడుగుటకు, పావన పరచుటకు కోరుకొనవలెను. 1 యోహాను 2:1 ప్రకారము ఆయన మన ఉత్తరవాది, విజ్ఞాపన కర్త, ప్రధాన యాజకుడు. ఆయన మనకొరకు విజ్ఞాపన చేయుట ద్వారాను, ఆయన రక్తముతో శుద్ధీకరించబడుట ద్వారాను మనము పరిపూర్ణులమవుదుము.

దేవుని పనిచేయుట కొరకు ఆయన కృపను, జ్ఞానమును కోరుకొనునట్లే ఆయన విజ్ఞాపన పరిచర్యను కూడ విశ్వాసముతో కోరుకొనవలెను. ఇట్టి ప్రాముఖ్యమైన పరిచర్య ద్వారా సమస్త శోధనలను మనము జయించగలము. లోకమోసము నుండి కాపాడబడి, ఆయన రెండవ రాకడ కొరకు సిద్ధపరచబడుదుము. ఆయన రాకడయందు మన గొప్ప స్వాస్థ్యమును పొందెదము.

## పదవ అధ్యాయము

# దేవుని సన్నిధిలో గొప్ప ధైర్యము

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక పదవ అధ్యాయములో, పాత నిబంధన బల్యర్పణలు, వివిధములైన ఆచారములు, వాడుకలు, పద్ధతులు కలిగియుండినను ఇశ్రాయేలు జనాంగమును అవి ఏలాగున పరిపూర్ణులుగా చేయలేకపోయెనో మరల మనకు జ్ఞాపకము చేయబడుచున్నది. కేవలము యేసుక్రీస్తు ప్రభువు కల్వరి సిలువలో చేసిన పరిశుద్ధమైన బల్యర్పణ మాత్రమే మనలను పరిశుద్ధులుగా చేయగలదు.

ఆయన బల్యర్పణ యొక్క మరియొక ఆశీర్వాదమేమనగా ఆయన ప్రశస్త రక్తము యొక్క శక్తిద్వారా అతి పరిశుద్ధ స్థలములోనికి వెళ్లుటకు గల ధైర్యము, "సహోదరులారా, యేసు మనకొరకు ప్రతిష్ఠించిన మార్గమున, అనగా నూతనమైనదియు, జీవము గలదియు, ఆయన శరీరము అను తెర ద్వారా యేర్పరచ బడినదియునైన మార్గమున, ఆయన రక్తము వలన పరిశుద్ధ స్థలమునందు ప్రవేశించుటకు మనకు ధైర్యము కలిగియున్నది. గనుకను,దేవుని ఇంటిపైన మనకు గొప్ప యాజకుడున్నాడు గనుకను... మనము దేవుని సన్నిధానమునకు చేరుదము" (హెబ్రీ 10:19-22). ఆయన రక్తము యొక్క శక్తిద్వారా అతి పరిశుద్ధ స్థలములోనికి ఎప్పుడైనను, ఏ అక్కర నిమిత్తమైనను వెళ్లగలము. ఆయన ప్రధాన యాజకత్వపు పరిచర్యను అధికముగా అన్వయించుకొను కొలది ఆయన సన్నిధిలో అధిక ధైర్యము

అనుభవించగలము (హెబ్రీ. 10:21). ఆయన బల్యర్పణ ద్వారా మధ్య గోడను కూల్చివేసెను. అట్టి ధైర్యమును అనుభవించ లేకపోయినప్పుడు మన హృదయములను పరిశీలించుకొని, మన పతనములను ఒప్పుకొని, ఆయన ప్రశస్త రక్తముతో శుద్ధీకరింపబడవలెను. అప్పుడు మరల ఆయన సన్నిధిలో గొప్ప ధైర్యమును అనుభవించగలము.

## పదకొండవ అధ్యాయము

# గొప్ప విశ్వాస వీరులు

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక పదకొండవ అధ్యాయములో మన ప్రధాన యాజకుడుగా యేసుక్రీస్తు ప్రభువు యొక్క పరిచర్య విశ్వాసము ద్వారా అధిక శక్తివంతముగా నుండుట చూడగలము. ముందు అధ్యాయములలో చెప్పబడిన సమస్త ఆత్మీయ ఆశీర్వాదములను విశ్వాసము ద్వారానే అనుభవించగలము. "విశ్వాసమనునది నిరీక్షింపబడువాటియొక్క నిజస్వరూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు ఋజువునైయున్నది" (హెబ్రీ.11:1). దేవుని జీవమును పొందినప్పుడు అదృశ్యమైనవే మనకు అధిక వాస్తవమైనవగును. దేవుని వాక్యము, దేవుని రాజ్యము, అందులో మన భాగము మొదలగు పరలోకపు సంగతులపట్ల అధికమైన ప్రీతిని నిజమైన విశ్వాసమును మనలో కలుగజేయును (కొలొస్స. 3:2-4). "దానిని బట్టియే పెద్దలు సాక్ష్యము పొందిరి" (హెబ్రీ 11:2). విశ్వాసము ద్వారా గొప్ప దైవ జనులు దేవునికి అంగీకారమైన జీవితమును కొనసాగించగలిగిరి. దేవుడు కనబరచి, ప్రకటించిన దెల్లను వారు నమ్మి విధేయులైరి. మారుమాట లేకుండ విధేయులమైనప్పుడు మన విశ్వాసము కూడ బలమైనదగును.

"ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణమైనవనియు, అందునుబట్టి దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మింపబడ లేదనియు విశ్వాసముచేత గ్రహించుకొనుచున్నాము" (హెబ్రీ 11:3). దేవుని వాక్య ప్రకారము శూన్యములోనుండి ఆయన సమస్తమును కలుగజేసెను. బైబిలును నమ్మనివారు సృష్టిని గూర్చి అనేక సిద్ధాంతములను రూపొందించిరి. సమస్తమును సృష్టించుటకు అనేక దినములు పట్టెనని కొందరనుచున్నారు. అయితే యేసుక్రీస్తు ప్రభువు యొక్క ఒక్క మాట ద్వారా సమస్తము కలిగెనని దేవుని వాక్యము బయలు పరచుచున్నది (కీర్తనలు 33:9). మానవ బుద్ధి జ్ఞానములు, లేక విజ్ఞాన శాస్త్రముల ద్వారా గ్రహించుటకు ప్రయత్నించిన యెడల మరి ఎక్కువ కలవరము కలుగును. దేవుని జీవమును పొందనివారు మానవ కల్పితములైన సిద్ధాంతములనే నమ్మెదరు. వారికి అదృశ్యమైన సంగతులు విలువ లేనివిగా నున్నవి. అయితే బైబిలు బయలుపరచుచున్న దానిని మనము నమ్ముచున్నాము. దేవుడు మట్టితో మానవుని కలుగజేసెను. విత్తనము వేయలేదు. భూమిని దున్నలేదు, అయినను చెట్లు చేమలన్నియు కలిగినవి (ఆదికాండము 1:12). సూర్యచంద్రాదులు లేకపోయినను, దేవుని వాక్కు ద్వారా వెలుగు కలిగెను. ఆదికాండము మొదటి అధ్యాయములో నున్న ప్రకారము, "ఆయన పలుకగా ఆ ప్రకారమాయెను." విశ్వాసము ద్వారా దీనిని గ్రహించుచున్నాము. విశ్వాసము ద్వారా దీనిని నమ్ముచున్నాము. నమ్మలేని వారు భయముతో, సందేహముతో నిండియుండి దేవుడు వారికొరకు సిద్ధము చేసిన వాటిని గ్రహించలేక

పోవుచున్నారు. దేవునికి ప్రీతికరమగు అర్పణను తీసికొనిరావలెనని కయీను, హేబెలు, ఇరువురును కోరినట్లు హెబ్రీ 11:4లో చూడగలము. వారి పక్షముగా ఒకరు చనిపోవలెనని దేవుడు చూపించెను. కయీను తర్కించుటకు మొదలు పెట్టి, భూఫలములతో దేవునికి ఎక్కువ ఆనందము కలుగునని తలంచెను; అయితే దేవుడు వాటిని కోరలేదు. హేబెలు దేవుని నమ్మి ఆయన కోరినదానిని అర్పించెను. ఆ విధేయత కార్యమును బట్టి హేబెలు నీతిమంతుడుగా తీర్చబడెను.

హెబ్రీ 11:5లో పేర్కొనబడినట్లు హనోకు దేవునితో నడచెను (ఆదికాం 5:22, 24). దీని భావమేమనగా, రాత్రిలోగాని పగటిలో గాని దేవుడు అతనిని పిలిచినప్పుడెల్లను ఆయన యొద్దకు వెళ్లుటకు అతడు సిద్ధముగా నుండెను. అతడు ఎన్నడును ఆయనను తిరిగి ప్రశ్నించలేదు. అతడు తనను తానే సంతోషపరచు కొనలేదు గాని దేవుని సంతోషపరచెను. అట్టి విశ్వాసముతోనే అతడు పైకెత్తబడెను. ఒక తల్లి హనోకు కథను తన కుమార్తెకు చెప్పెను. ఆ తరువాత ఆమెను ఎవరో ఈలాగున అడిగిరి, "హనోకు ఏలాగున పరమునకు వెళ్ళెను?" సామాన్యమైన విశ్వాసముతో ఆ బిడ్డ ఈలాగున చెప్పెను. "హనోకు, దేవుడు చాలామంచి మిత్రులు, ప్రతిదినము వారు కలసి ఎంతో దూరము నడచు చుండెడివారు. ఒక దినమున వారు అలాగున నడచి వెళ్ళుచుండగా - హనోకుతో ఇంటికి వెళ్లుదుమా? అని దేవుడు అడుగగా, సరే ప్రభువా నేను సిద్ధముగా నున్నానని హనోకు

చెప్పెను. గనుక వారిరువురును పరమునకు వెళ్లిరి.'' అట్టిది ఏలాగున సంభవించెను? అని కొందరు ప్రశ్నించుదురు. దేవుడు తన వాక్యములో చెప్పినదానినెల్లను సామాన్యమైన విశ్వాసముతో మనము అంగీకరించవలెను. ''దేవుడు చెప్పెను'', ''యెహోవా సెలవిచ్చెను'' అను పదములు బైబిలునందలి మొదటి ఐదు పుస్తకములలో 558 పర్యాయములును, దాదాపు 2000 పర్యాయములు పాత నిబంధనలోను కనబడుచున్నవి. బైబిలు లోని ప్రతి వచనము దేవుని వాక్కుయే గాని మానవ వాక్కు కాదని ఇది ఋజువు చేయుచున్నది. నేను మారుమనస్సు పొందిన తరువాత బైబిలు దేవుని వాక్యమని నమ్ముటకు ఈ పదములు నాకు సహాయపడినవి. ఆయన వాక్యము కొరకు నూతన ప్రేమను అవి నాకొసగినవి. ఒక దినమున ఒక సందేహము గల వ్యక్తి నాయొద్దకు వచ్చి ఈలాగున ప్రశ్నించెను. ''మొదటి పుట నుండి చివరి పుట వరకు బైబిలు దేవుని వాక్యమని నమ్ముచున్నారా?'' నేను ''నమ్ముచున్నాను'' అని సమాధానమిచ్చితిని. మరల అతడు ఈలాగున అడిగెను. ''యోనా మూడు దినములు చేప కడుపులో నుండెనని నమ్ముచున్నారా?'' 'బహు గట్టిగా నమ్ముచున్నాను. చేప యోనా కడుపులో నుండెనని బైబిలు చెప్పిన యెడల దానిని కూడ నమ్మెదను గాని బైబిలును ఎన్నడును సందేహించను' అని బదులిచ్చితిని. ప్రజల రక్షణార్థమై తన వాక్యములోని చిన్న పదములను దేవుడు వాడుచుండును. బైబిలును నెమ్మదిగా, క్రమముగా మోకాళ్లపై నుండి చదివిన యెడల అనేక ఆశీర్వాదములను పొందెదము. మనము చదువునప్పుడు

ఈలాగున ప్రార్థించవలెను. "ప్రభువా నా అక్కర ననుసరించి నాతో మాటలాడుము." ఆవాక్యమును మౌనముగా ధ్యానించుట ద్వారా అనేక గూఢమైన మర్మములు మనకు బయలు పడును. కొన్ని బైబిలు సత్యములు రోగములు, శ్రమలు, కష్టములు, ఒంటరితనములో మనము ఉన్నప్పుడు బయలు పరచబడును. ఇది దేవుని వాక్యము, పరిశుద్ధాత్ముడే మనకు శ్రేష్ఠమైన బోధకుడు.

బైబిలులో వ్రాయబడియున్న నోవహు కాలములో వచ్చిన జల ప్రళయమును గూర్చిన చరిత్రను అనేకులు సందేహించిరి. అయితే అనేక ఎత్తయిన పర్వతముల మీద సముద్ర జంతువుల అస్థిపంజరములు కనుగొనబడినప్పుడు, ఈ పర్వతములన్నియు ఒకప్పుడు నీటిచే కప్పబడియుండవచ్చునని నమ్మిరి. దేవుడు ఓడను నిర్మించుమని నోవహుకు ఆజ్ఞాపించినప్పుడు, అతడు తీర్పు రానున్నదని నమ్మి వెంటనే లోబడెను (హెబ్రీ 11:7). అతడు దేవుని ఇదేమని ప్రశ్నించలేదు. అతని పనివారు హేళన చేసియుండ వచ్చును గాని అతడు దేవుని నమ్మెను. విశ్వాసము ద్వారా అతడు నీతిమంతుడుగా తీర్చబడెను. మనము కూడ మన విశ్వాసమును బట్టి అనేక హేళనలను ఎదుర్కొనవలసి యుండినను, అట్టి అనుభవములు మనకు బలమైన విశ్వాసమును కలుగ చేయును.

అబ్రాహాము కల్దీయుల ఊరు అను పట్టణములో అభివృద్ధి చెందుచున్న భాగ్యవంతుడుగా నుండెను. ఆ పట్టణమును విడచి తెలియని ప్రదేశమునకు వెళ్లుమని దేవుడు అతనికి చెప్పినప్పుడు, వెంటనే అతడు లోబడెను. నీవు ఎక్కడికి వెళ్లుచున్నావు అని

అనేకులు అతనిని ప్రశ్నించియుందురు. తనకు తెలియదు అని అతడు బదులిచ్చియుండును. అ పట్టణమంతటిలో అతడొక్కడే దేవుని నమ్మెను, అయితే అతడు హేళనను ఎదుర్కొనవలసి యుండెను. దేవుడు తనను ఎక్కడకు నడిపించుచుండెనో ఎరుగక పోయినను ఆయనకు లోబడి, పట్టణమును విడచి వెళ్లెను. అతని యొక్క విధేయత, విశ్వాసమును బట్టి ఆ తరువాత దేవుడు అతనికి పునాదులు గల పట్టణము యొక్క దర్శనమను గ్రహించెను. అతడు విశ్వాసమందు బలపడెను (హెబ్రీ 11:8-10). అబ్రాహామునకు విస్తారముగా వెండి బంగారములున్నందున, ఒక యిల్లు కట్టుకొనవలెనని అతడు కోరెను. అయితే అతని జీవిత కాలమంతటిలోను దేవుడు అతనిని ఇల్లు కట్టుకొన నియ్యలేదు. ఒక భూభాగమును కొననియ్యలేదు. ఒక పరదేశిగా, యాత్రికుడుగా గుడారములోనే అతడు జీవించెను. బలమైన, చురుకైన, సజీవ విశ్వాసముద్వారా మనము కూడ అందులో భాగముగా నున్న పరలోక పట్టణము యొక్క మహిమను చూడగలము.

అదేరీతిగా, దేవుడు ఎంతోకాలము .శారాను గొడ్రాలుగా నుంచెను. మనకేమి సంభవించినను, బలమైన విశ్వాసము మనకను గ్రహించవలెనను ఉద్దేశముతోనే సంభవించుచున్నవి. అట్టి విశ్వాసము లేనియెడల మన రక్షణ యొక్క మహాత్మ్యమును ఎన్నడును ఎరుగలేము (హెబ్రీ 11:13-16). మన దృష్టిని నశించుచున్న వాటిపైనుండి మరల్చి పరలోకపు, నిత్యమైన వాటిపై నిలుపునట్లుగా చేయుటకు దేవుడు అనేక విధములైన పరిస్థితులు,

శ్రమలు, బాధలు పరీక్షలను ఉపయోగించును. మన అక్కర ప్రకారము కోరుకొను కొలది పునరుత్థానశక్తి మనకెంతో వాస్తవమైనదగును (హెబ్రీ 11:18). అతనికి బలమైన విశ్వాసము ననుగ్రహించుటకు, అతని ఏకైక కుమారుని బలిపీఠముపై నర్పించుమని దేవుడు అబ్రాహామును కోరెను. అతడు దేవుని శంకించలేదు. తన కుమారుని తాను వధించినను దేవుడు అతనిని బ్రతికించుటకు సమర్థుడని అతడు నమ్మెను. అట్టి విశ్వాసముతో తన కుమారుని బంధించి, వధించుటకు కత్తి నెత్తెను. తన భార్యకు అట్టి విశ్వాసము లేదని అతడు ఎరుగును. అందువలననే ఆమెను సంప్రదించకుండానే తన కుమారుని అర్పించుటకు అతడు వెళ్లెను (ఆదికాం 22:3). అతడు వేకువనే లేచి, తన దాసులను, గాడిదను తీసికొని వెళ్లెను. ఆమెతో చెప్పిన యెడల, ఇస్సాకును అర్పించుటకు ఆమె ఒప్పుకొనదని అతడు ఎరుగును. ఆమె ఈలాగున అని యుండెడిది. "మన ఒక్కడైన కుమారుని ఏలాగున అర్పించ గలము? దేవుడు ఎన్నడును అట్టిది అడుగడు." అలాగుననే అనేక పర్యాయములు మనము కూడ ప్రశ్నించుచుందుము. అబ్రాహాము విశ్వాసి గనుక, ఎట్టి సందేహము లేక, ఉదయమున త్వరగా లేచి, తన దాసులను, కుమారుని తీసికొని వెళ్లి దేవుని విశ్వాస్యతను నిరూపించెను. అలాగున అతని విశ్వాసము బలమైనదాయెను. పొదలో చిక్కుకొనియున్న పొట్టేలు ద్వారా, తానుకూడ అతనికి కట్టుబడి యుండెనని దేవుడు అతనికి చూపించెను గనుక మన రక్షణను సంపూర్ణముగా అనుభవించ

గలుగుటకు మనకు బలమైన, చురుకైన విశ్వాసము కావలెను. పరలోకపు నిత్యమైన పట్టణములో మన భాగము విశ్వాసము ద్వారా మనకు వాస్తవమైనదగును. అబ్రాహాము లేక దావీదు లేక మోషే కలిగి యుండినట్టి విశ్వాసమును మనకు అనుగ్రహించును. కావున ఎట్టి శ్రమ, పరీక్షను బట్టియైనను దేవునికి కృతజ్ఞతా స్తుతులను చెల్లించగలము. అది జీవితాంతము కలుగు అనుభవము. అట్టి విశ్వాసము కొరకు బాధకరములైన అనేక పరిస్థితుల ద్వారా మనము వెళ్లవలసి యుండును.

## పండ్రెండవ అధ్యాయము

# గొప్ప దైవభక్తి

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక పండ్రెండవ అధ్యాయములో అపొస్తలుడు ఈలాగున హెచ్చరించుచున్నాడు. " మనము కూడ ప్రతి భారమును, సులువుగా చిక్కులబెట్టు పాపమును విడచిపెట్టి... మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము." మనలను సులువుగా చిక్కులబెట్టు పాపము అవిశ్వాసము లేక సందేహము. ఇది మనలను ఆత్మీయముగా గ్రుడ్డివారినిగా చేయును. ఎక్కువగా బరువుగానున్న వ్యక్తి, భోజనము తగ్గించి సరియైన బరువునకు వచ్చునంత వరకు పందెములో పరుగెత్తలేడు. "ఇప్పుడైతే సీయోనను కొండకును జీవము గల దేవుని పట్టణమునకు, అనగా పరలోకపు యెరూషలేమునకును.... మీరు వచ్చియున్నారు" (హెబ్రీ 12:22). మనము హెబ్రీ 11:10లో చూచుచున్న రీతిగా పునాదులుగల ఆ పరలోక పట్టణములో మనము భాగము పొందవలెనని ప్రభువు కోరుచున్నాడు. ఆ పరలోక పట్టణమునకు మనలను సిద్ధము చేయుటకు ప్రభువు మనలను గద్దించి, శిక్షించవలసియున్నది. "ప్రభువుతాను ప్రేమించువానిని శిక్షించి తాను స్వీకరించు ప్రతి కుమారుని దండించును.... శిక్షాఫలము పొందుటకై మీరు సహించుచున్నారు; దేవుడు కుమారులనుగా మిమ్మును చూచుచున్నాడు. తండ్రి శిక్షింపని కుమారుడెవడు? కుమారులైన వారందరు శిక్షలో పాలుపొందుచున్నారు. మీరు పొందని యెడల దుర్బీజులే గాని కుమారులు కారు" (హెబ్రీ 12:6-8).

పరలోక పట్టణములో పరలోక రాజులుగా నిరంతరము దానిని స్వతంత్రించుకొనుటకు దేవుని పరిశుద్ధతలో మనము పాలివారము కావలెను. మనము ఎడతెగక దేవునిచేత శిక్షింపబడవలెను. "మరియు ప్రస్తుతమందు సమస్త శిక్షయు దుఃఖకరముగా కనబడునే గాని సంతోషకరముగా కనబడదు. అయినను దానియందు అభ్యాసము కలిగినవారికి అది నీతియను సమాధానకరమైన ఫలమిచ్చును" (హెబ్రీ12:11). దేవుడు ఎంతో గొప్ప ఉద్దేశముతో ఆ పరలోక పట్టణములో మనలను పౌరులను గాను, రాజులను గాను చేయగోరుచున్నాడు. అచ్చట దేవుని దూతలు మనకు పరిచర్య చేయుటకు నియమింపబడిరి (హెబ్రీ 1:13,14).

అంత్య దినములలో దేవుడు సమస్తమును చలింపజేయబోవు చున్నాడు (హెబ్రీ 12:26). మన ప్రయాసము, జ్ఞానము లేక శక్తి ద్వారా నెరవేర్చబడిన వన్నియు తీసివేయబడును. కేవలము ఆయన శక్తి ద్వారా ఆయన స్తుతి మహిమ నిమిత్తము నెరవేర్చబడినవి మాత్రమే నిలిచి యుండును. కనుకనే ఎడతెగక మనలను మనమే పరీక్షించుకొనుచు, మన జ్ఞానము, శక్తితో ఏమియును చేయక సమస్తమును దేవుని మహిమార్థము పరిశుద్ధాత్మ ద్వారా జరిగించవలెను. "అందువలన మనము నిశ్చలమైన రాజ్యమును పొంది, దైవకృప కలిగి వినయ భయభక్తులతో దేవునికి ప్రీతికరమైన సేవ చేయుదము" (హెబ్రీ 12:28). ఆ నిశ్చలమైన రాజ్యములో మనము నివసించనై యున్నాము.

## పదమూడవ అధ్యాయము

# గొప్ప వాగ్దానము

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక పదమూడవ అధ్యాయములో మహారక్షణ యొక్క మరియొక లక్షణమును చూడగలము. ఐదవ వచనములో మనకు ఒక వాగ్దానము కలదు. "నిన్ను ఏమాత్రమును, విడువను నిన్ను ఎన్నడును ఎడబాయను." లోభులము కాకుండ సంతృప్తికరమైన జీవితమును కొనసాగించి నప్పుడు ఈ వాగ్దానము మన జీవితములలో నెరవేరును. ప్రతివిధమైన దురాశనుండి మన హృదయములను కాపాడుకొన వలెను. అప్పుడు ధైర్యముగా ఆరవ వచనములో నున్న ప్రకారము పలుకగలము. "ప్రభువు నాకు సహాయుడు, నేను భయపడను, నరమాత్రుడు నాకేమి చేయగలడు?"

పదమూడవ వచనములో అపొస్తలుడు ఈలాగున హెచ్చరించు చుండెను. "కాబట్టి మన మాయన నిందను భరించుచు శిబిరము వెలుపలికి ఆయన యొద్దకు వెళ్లుదము." ప్రత్యేక జీవితమును జీవించుట ద్వారా ప్రభువు నిమిత్తము నిందను భరించుటకు మనము యిష్టపడవలెను. ఇహలోక స్నేహితుల ద్వారా, ఇహలోక సంపర్కముల ద్వారా అపవిత్రులము కాకూడదు. అప్పుడు మనకు పరలోక పట్టణపు దర్శనము అనుగ్రహించబడును.

ఆయన పరిపూర్ణ చిత్తము చేయుటకు మనకు నేర్పించుట ద్వారా పరిపూర్ణతకు మనలను తెచ్చుటకు ప్రభువు సంపూర్ణ ఏర్పాటును చేసెను. 20,21 వచనములలో దేవుని పరిపూర్ణ చిత్తమును కనుగొని, దానిని నిర్ధారణ చేసికొనుటకు ఏడు నిదర్శనములను చూడగలము. ఈ రెండు వచనములను ఏడు భాగములుగా విభజింపవచ్చును.

(1) సమాధానకర్తయగు దేవుడు (2) మృతులలో నుండి లేపినవాడు (3) యేసు అను మన ప్రభువు (4) గొఱ్ఱెల గొప్ప కాపరి (5) నిత్యమైన నిబంధన సంబంధమగు రక్తము (6) ప్రతి మంచి విషయములో తన చిత్త ప్రకారము చేయుటకు మిమ్మును సిద్ధపరచును గాక (7) యేసుక్రీస్తుకు యుగయుగములకు మహిమ కలుగును గాక! దేవుని పరిపూర్ణమైన చిత్తమును కనుగొని మన జీవితములో ఆ ప్రకారము చేయుట ద్వారా మనము దేనికి పిలువబడితిమో ఆ పరిపూర్ణతను పొందగలము. పైన చెప్పబడిన విషయముల వివరములను కొంత చూతము.

1. మన దేవుడు సమాధాన కర్తయగు దేవుడు. ఎప్పుడైనను ఏ విషయమును గూర్చియైనను దేవుడు మాటలాడిన యెడల, పెంపొందించు, విస్తరించుచు నుండు నిత్యమైన పరలోకపు సమాధానము కలుగును (యెషయా 32:17). యేసుక్రీస్తు ప్రభువు పునరుత్థానుడైన తరువాత తన శిష్యులకు ప్రత్యక్షమైనప్పుడు పలికిన మొదటి మాటలు, "మీకు సమాధానము కలుగును గాక." ఇదే మాటలను రెండు పర్యాయములు యోహాను 20:19, 21లలో

ఆయన పలికెను. మార్కు 4:39లో ఇట్టి మాటలతోనే ఆయన గాలిని, సముద్రమును గద్దించెను. "నిశ్శబ్దమై, ఊరకుండుము." ప్రభువు మాటలాడినప్పుడు సమాధానము కలుగును. ప్రతి తుఫాను నిమ్మళమై పోవును.

2. "మృతులలో నుండి లేపిన" యను మాటలు పునరుత్థాన శక్తిని సూచించుచున్నవి. మన స్వంతశక్తి ద్వారా దేవుని చిత్తమును చేయలేము. అపొస్తలులు తమ పరిచర్యలో పునరుత్థాన శక్తిని అనుభవించిరి (అపొ. 2:24; 3:26, 4:10, 33;5:30). వారు బహు ధైర్యముగా యేసుప్రభువు యొక్క పునరుత్థానమును ప్రకటించిరి. మనము దేవుని సంపూర్ణ చిత్తములో ఉండిన యెడల ఆయనకు విధేయుల మగుటకు కావలసిన పునరుత్థాన శక్తిని పొందెదము.

3. ఆయన చిత్తమును చేయుట ద్వారా యేసు ప్రభువు యొక్క ప్రభుత్వము క్రిందికి మనము తేబడుదుము. ఎల్లవేళలయందు ఆయన ప్రభుత్వము క్రిందను, యాజమాన్యము క్రిందను ఉన్నప్పుడు కేవలము ఆయన చిత్తమును చేయగోరుదుము. ఆయన మన ప్రభువుగాను, మన రాజుగాను ఉన్నందున ఎల్లప్పుడు ఆయన అదుపులోనే ఉందుము.

4. యేసుక్రీస్తు ప్రభువు గొఱ్ఱెల గొప్ప కాపరి. ఆయన మన కాపరియైనందున తన చిత్తమును దృఢపరచుటకు అనేక లేఖన భాగముల చెంతకు మనలను నడిపించును (కీర్తన 23:2, 3). ఆత్మీయముగా మనము సేవించబడగల స్థలములకు మంచి

కాపరి మనలను నడిపించును. దేవుని చిత్తములో మన మున్నప్పుడు ఆత్మీయ సంతృప్తిని కలిగియుందుము. పచ్చిక బయళ్ల యొద్దకును, శాంతికరమైన జలముల చెంతకును, ఆయన మనలను నడిపించును. ఆయనే మనకు సంతృప్తిగా నున్నాడు.

5. అతి పరిశుద్ధ స్థలములో ప్రవేశించుటకు మనకు ధైర్యము కలుగునట్లుగా మనలను శుద్ధులుగా నుంచుటకు యేసుక్రీస్తు ప్రభువు యొక్క "నిత్య నిబంధన" సంబంధమైన ప్రశస్త రక్తమును కోరుకొనవచ్చును.

6. దేవుని చిత్తములో నున్నప్పుడు ప్రతి సత్కార్యములోను మనము పరిపూర్ణులముగా చేయబడుదుము. దేవుని చిత్తములో ఉన్నామనుటకు ఆరవ నిదర్శనమేమనగా ప్రతి చిన్న విషయము లోను దేవుని చిత్తమునే చేయగోరుదుము. ప్రతి అడుగున దేవుని ద్వారా నడిపింప గోరుదుము. ఒకని నడక యెహోవా చేతనే స్థిరపరచబడును (కీర్తన 37:23). మన నడత యంతయు ఆయన ఆధీనములో యుండి క్రమపరచబడును. నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణ హృదయముతో యెహోవాయందు నమ్మకముంచుము (సామెతలు 3:5). మన మార్గములన్నిటిలో ఆయన అధికారమునకు ఒప్పుకొనుట ద్వారా ప్రతి మంచి విషయములోను ఆయన చిత్తప్రకారము చేయుటకు పరిపూర్ణులమగుదుము.

7. చివరిగా, దేవుని చిత్తమును చేయుటలో ఆయన నామము ఉన్నతముగా ఘనపరచబడవలెను. ఆయన చిత్తమును చేయునప్పుడు ప్రభువును మహిమ పరచవలెనను కోరిక మనలో నుండవలెను. దేవుని చిత్తమును ఎరుగుటకు ఈ ఏడు నిదర్శనములు మనకివ్వబడినవి.

"మీ పైని నాయకులుగా ఉన్నవారు లెక్క ఒప్పచెప్ప వలసిన వారివలె మీ ఆత్మలను కాయుచున్నారు; వారు దుఃఖముతో ఆ పని చేసిన యెడల మీకు నిష్ప్రయోజనము గనుక దుఃఖముతో కాక, ఆనందముతో చేయునట్లు వారి మాట విని, వారికి లోబడి యుండుడి" (హెబ్రీ 13:17). మనకు బోధించి, నడిపించువారికి లోబడియుండు ఆధిక్యతను మనము కలిగియున్నాము. మన భద్రత, కాపుదల నిమిత్తము మనలను కాయుచు, బోధించుచు నడిపించుచున్న వారికి మనము విధేయులమై యుండవలెనని దేవుడు నియమించెను. అలాగున చేయుటకు వినయ విధేయతలు కలిగి యుండవలెను. దేవుని సేవకులకు లోబడి యుండుట ద్వారా శత్రువు యొక్క ఎదిరింపుల నుండి కాపాడబడుదుము.

రక్షణ మహాత్మ్యమును చూడగలుగుటకు ప్రభువు మన కన్నులను తెరచి అనుదినము దానివలన కలుగు మేళ్లను అనుభవించునట్లుగా సహాయము చేయుచు పరిపూర్ణతకు మనలను నడిపించునుగాక !

☆☆☆